# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | మంగళవారం, జనవరి 20, 2026 | సంపుటి:11 | సంచిక :265 | పేజీలు: 8 | వెల : రూ.5




## కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత



## ఏపీలో నేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ విడుదల

- తొలి విడత త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేశామన్న మంత్రి సవిత
- 133 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో రూ.1.67 కోట్లు జమ చేసినట్లు వెల్లడి
- మొత్తం 5,726 మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుందన్న మంత్రి సవిత

2లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుకు నోటీసులు

- సిట్ నోటీసులతో కేసులో కీలక మలుపు
- జూబ్లీహిల్స్ పీఎస్‌లో విచారణకు హాజరు ఆదేశం
- న్యూస్ ఛానల్ ఎండీ స్టేట్మెంట్ కీలకం
- రాజకీయ నేతల వైపు విస్తరిస్తున్న విచారణ
- తెలంగాణ రాజకీయాల్లో పెరుగుతున్న ఉత్కంఠ

# 4శాతం వడ్డీతో విద్యా రుణాలు




రాష్ట్రంలో వ్యాపారాలకు, పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అవకాశాలున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే ప్రవాస తెలుగువారికి (ఎన్నార్టీ) సహకరిస్తాం. వారిని పారిశ్రామికవేత్తలుగా చేయడానికి రూ.50 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. 195 దేశాల్లో తెలుగువారు ఉంటే 148 దేశాల్లో ఎన్నార్టీ వ్యవస్థను ఏర్పాటు చేశాం. మిగిలిన దేశాలకూ విస్తరిస్తాం.

- చదువుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ చదివిస్తాం
- రూ.50 కోట్లతో ఎన్నార్టీల కోసం కార్పస్ ఫండ్
- పెట్టుబడుల కోసం మంత్రులకు, నాకు మధ్య పోటీ
- ఫలితమే దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి
- విద్యుత్తు సంస్కరణలతోనే రాష్ట్రానికి డేటా సెంటర్లు
- అన్ని రంగాల్లో తెలుగు వారు అభివృద్ధి సాధించాలి
- అదే నా లక్ష్యం.. అప్పుడే నాకు సంతృప్తి
- జ్యూరిక్‌లో యూరప్ తెలుగు డయాస్పోరా
- సమావేశంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి: చదువుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ చదివిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న మంచి యూనివర్సిటీల్లో ఎక్కడ చదవాలని విద్యార్థులు కోరుకుంటే అక్కడ అవకాశం కల్పిస్తున్నాం. ప్రభుత్వ గ్యారెంటీతో 4 శాతం వడ్డీతో విద్యారుణాలు ఇప్పించి వారికి విదేశీ విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని పేర్కొన్నారు. దావోస్ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. దావోస్‌కు తొలిసారి వచ్చినప్పుడు భారతీయులు తక్కువగా ఉండేవారని, తెలుగువాళ్లు అసలే లేరన్నారు. కానీ ఇప్పుడు తెలుగువారు ఉండటమే కాదు, వారిని చూస్తే విజయవాడలో ఉన్నామా.. విశాఖలో ఉన్నామా అనేలా ఉందన్నారు. యూరప్‌లోని 20 దేశాల నుంచి వచ్చిన తెలుగువారిని ఒక్కచోట చూస్తుండటం ఆనందంగా ఉందని తెలిపారు. 195 దేశాల్లో తెలుగువారు ఉంటే 148 దేశాల్లో ఎన్నార్టీ (ప్రవాస తెలుగు వారు) వ్యవస్థను ఏర్పాటు చేశామని, మిగిలిన దేశాలకూ విస్తరిస్తామన్నారు. ఏపీలో రతన్

- మిగతా 2వ పేజీలో




## పిన్నెల్లి బ్రదర్స్ కు పోలీస్ కస్టడీ

- జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు పోలీస్ కస్టడీ
- మూడు రోజుల కస్టడీకి అనుమతించిన మాచర్ల కోర్టు
- గుండ్లపాడు జంట హత్యల కేసులో ఏ6, ఏ7గా నిందితులు
- వాస్తవాలను రాబట్టేందుకు విచారణ జరపనున్న పోలీసులు




## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

- ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్
- రేపు ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం
- జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఎన్నిక
- ఆరెస్సెస్ నేపథ్యంతో ఎదిగిన నాయకుడు
- బీహార్ బాంకీపూర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యే

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో పార్టీ రాజ్యాంగ ప్రక్రియల ప్రకారం ఈ ఎన్నిక అనివార్యమైంది. బీజేపీ అధిష్ఠానం పూర్తి ఏకాభిప్రాయంతో నితిన్ నబీన్ పేరును ఖరారు చేయగా, ఎలాంటి పోటీ లేకుండా ఆయన జాతీయ అధ్యక్ష పదవిని అధిష్ఠించారు. నితిన్ నబీన్ రేపు ఉదయం 11 గంటలకు పార్టీ జాతీయ

# దావోస్‌కు బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి



- ఆర్థిక సదస్సులో పాల్గొననున్న సీఎం
- సీఎంతో పాటు మంత్రి పొంగులేటి, అధికారులు దావోస్‌కు
- ఏఐ, సెమీకండక్టర్స్, గ్రీన్ ఎనర్జీపై పెట్టుబడుల ఫోకస్
- ప్రముఖ సీఈవోలు, పారిశ్రామికవేత్తలతో భేటీలు
- ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

తెలంగాణ రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు బయల్దేరారు. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు వెళ్లారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నత స్థాయి అధికారులు పాల్గొంటున్నారు. ఇప్పటికే దావోస్‌లో ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఈ సమావేశాల్లో భాగస్వామ్యం కానున్నారు. తెలంగాణకు అవసరమైన పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది.




## రాజకీయ వేధింపులే కాంగ్రెస్ అజెండా: కేటీఆర్

- హరీశ్‌రావుకు నోటీసులపై కేటీఆర్ మండిపాటు
- ఫోన్ ట్యాపింగ్ కేసుకు పసలేదన్న సుప్రీంకోర్టు తీర్పు
- డైవర్షన్ పాలిటిక్స్‌కే నోటీసులని ఆరోపణ
- ప్రతిపక్ష గొంతు నొక్కే యత్నం విఫలమవుతుందన్న హెచ్చరిక
- బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం

# ఏపీలో నేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ విడుదల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నేతన్నలకు కూటమి ప్రభుత్వం శుభవార్తను అందించింది. నేతన్నలకు సంబంధించిన త్రిఫ్ట్ ఫండ్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయాన్ని ఏపీ మంత్రి సవిత మీడియాకు తెలియజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా త్రిఫ్ట్ ఫండ్ నిధులను విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 133 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో రూ.1.67 కోట్లను జమ చేశామని తెలిపారు. ఈ నిధుల ద్వారా మొత్తం 5,726 మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగకు ముందే ఆప్కోకు సంబంధించిన రూ.5 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని మంత్రి సవిత గుర్తు చేశారు. అదే విధంగా డిసెంబర్ నెలలో రూ.2.42 కోట్ల బకాయిలను కూడా ఆప్కో ద్వారా చెల్లించినట్లు తెలిపారు. ఈ రెండు నెలల వ్యవధిలోనే రూ.9 కోట్లకు పైగా నిధులను నేతన్నలకు అందించామని వివరించారు. చేనేత రంగ అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు. త్రిఫ్ట్ ఫండ్ నిధుల విడుదలపై కూటమి ప్రభుత్వానికి, మంత్రి సవితకు చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుకు నోటీసులు

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు మరో కీలక మలుపు తిరిగింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై కొనసాగుతున్న విచారణలో భాగంగా, మాజీ మంత్రి మరియు బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావుకు ప్రత్యేక విచారణ బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. రేపు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొనడం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చలకు దారితీసింది.

ఇప్పటికే ఈ కేసులో పలువురు ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు అరెస్టయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అధికార యంత్రాంగం వరకే పరిమితం అవుతుందన్న అంచనాలను తలకిందులు చేస్తూ, ఇప్పుడు నేరుగా ఒక కీలక రాజకీయ నాయకుడికి నోటీసులు జారీ కావడం ఈ కేసుకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. సిట్ విచారణ పరిధి క్రమంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, రాజకీయ నేతల పాత్రపై కూడా అధికారులు దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

హరీశ్‌రావుకు నోటీసులు జారీ కావడానికి ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) ఇచ్చిన స్టేట్మెంట్ కీలకంగా మారినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారం, ఆ సమాచార వినియోగం, అలాగే ట్యాపింగ్ ప్రక్రియలో జరిగిన కొన్ని అంతర్గత అంశాలపై సదరు ఎండీ సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో హరీశ్‌రావు పేరు ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే స్పష్టత కోసం ఆయనను విచారించాలని సిట్ నిర్ణయించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా, ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలు, తాజాగా వచ్చిన స్టేట్మెంట్‌ను బేరీజు వేసుకుని సిట్ అధికారులు ప్రశ్నల జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎలా ప్రారంభమైంది, ఎవరి ఆదేశాల మేరకు జరిగింది, సేకరించిన సమాచారం ఎవరికి చేరింది, దాని వినియోగం ఎలా జరిగింది వంటి కీలక అంశాలపై సిట్ లోతైన విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ విచారణలో రాజకీయ స్థాయి నుంచి ఆదేశాలు ఉన్నాయా లేదా అన్న కోణంలోనూ అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం హరీశ్‌రావు ఈ నోటీసులకు ఎలా స్పందిస్తారన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను రేపుతోంది. ఆయన రేపే విచారణకు హాజరవుతారా, లేక న్యాయ నిపుణులతో సంప్రదించి గడువు కోరుతారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ హరీశ్‌రావు విచారణకు హాజరైతే, సిట్ ఎలాంటి ప్రశ్నలు వేస్తుంది, ఆయన ఏ విధంగా సమాధానాలు ఇస్తారు అన్నది రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనుంది. ఈ పరిణామాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. పార్టీకి చెందిన కీలక నేతను విచారణకు పిలవడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. మరోవైపు, అధికార పక్షం మాత్రం ఈ కేసును చట్టబద్ధంగానే విచారిస్తున్నామని, ఎవరు తప్పు చేసినా వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ లాంటి తీవ్రమైన అంశంలో రాజకీయ హస్తక్షేపం ఉన్నా, లేకపోయినా సత్యం వెలుగులోకి రావాల్సిందేనన్నది ప్రభుత్వ వాదన.

# కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత

బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన అనంతరం తన రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా ఆమె వేగంగా అడుగులు వేస్తుండటం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్న కవిత, కొత్త రాజకీయ ప్రయోగానికి భూమిక సిద్ధం చేస్తున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పేరు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే)తో కవిత వరుస సమావేశాలు నిర్వహించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గత రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని తెలుస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా కూడా వీరిద్దరి మధ్య భేటీ జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది, ప్రజల్లోకి పార్టీని ఎలా తీసుకెళ్లాలి, సామాజిక వర్గాల సమీకరణ ఎలా ఉండాలి వంటి అంశాలపై వీరిద్దరి మధ్య విస్తృతంగా చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే ఈ సమావేశాలపై కవిత గానీ, ఆమె నేతృత్వంలోని తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. ఈ మౌనం మరింత ఉత్కంఠను పెంచుతోంది. మరోవైపు, ప్రశాంత్ కిశోర్ గతంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు వ్యూహకర్తగా పనిచేశారు. ప్రస్తుతం తమిళనాడులో నటుడు విజయ్ ఏర్పాటు చేస్తున్న పార్టీకి కూడా ఆయన మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు ప్రచారం ఉంది. అలాంటి వ్యూహకర్త ఇప్పుడు కవితతో కలిసి పనిచేస్తున్నారన్న వార్త రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కవిత ఇప్పటికే తెలంగాణ అస్తిత్వం, ప్రాంతీయ స్వరాన్ని బలోపేతం చేయాలంటే కొత్త రాజకీయ పార్టీ అవసరమని బహిరంగంగా ప్రకటించారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని కేవలం సామాజిక ఉద్యమంగా కాకుండా, రాజకీయ శక్తిగా మార్చాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు.

# రాజకీయ వేధింపులే కాంగ్రెస్ అజెండా: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ వేధింపులనే తన ఏకైక అజెండాగా మార్చుకుందని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపేనని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని సాక్షాత్తూ సుప్రీంకోర్టే చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా, ఆ కేసును కొట్టేసిందని గుర్తు చేశారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతోనే ఈ మొత్తం డ్రామా ముగిసిపోయిందని, అయినా మళ్లీ హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ ఎంత దిగజారిందో అర్థమవుతోందని కేటీఆర్ అన్నారు. న్యాయపరంగా ముగిసిన అంశాన్ని తిరిగి తెరపైకి తీసుకురావడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించాలనే ప్రయత్నం తప్ప ఇందులో మరొక ఉద్దేశం లేదని ఆరోపించారు. ఇది పూర్తిగా ప్రతిపక్షాన్ని వేధించడానికే తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి బొగ్గు గనుల కేటాయింపులో జరిగిన కుంభకోణాన్ని బీఆర్ఎస్ ఈరోజే బయటపెట్టిందని కేటీఆర్ తెలిపారు. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి ఆరోపణలు బయటకు రాగానే ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం, నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటైపోయిందని మండిపడ్డారు.



విచారణల పేరుతో, నోటీసుల పేరుతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూస్తే అది కాంగ్రెస్ భ్రమ మాత్రమేనని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని బెదిరించడం, భయపెట్టడం ద్వారా రాజకీయంగా లాభం పొందాలనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు పంపినా బీఆర్ఎస్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీల అమలు, రైతుల సమస్యలు, యువతకు ఉద్యోగాలు, అవినీతి వ్యవహారాలపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి రాజకీయ నాటకాలు ఆడుతోందని ఆరోపించారు.ద"మీరు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా మా పోరాటం ఆగదు. మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం. మిమ్మల్ని అడుగడుగునా ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇలాంటి చౌకబారు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు" అని కేటీఆర్ స్పష్టమైన హెచ్చరిక చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని, చివరికి ప్రజలే దీనికి తగిన సమాధానం చెబుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# 4శాతం వడ్డీతో విద్యా రుణాలు

(మొదటి పేజీ తరువాయి)

టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనేది ప్రభుత్వ విధానం" అని వివరించారు. "జన్మభూమిని మర్చిపోతే చరిత్ర హీనులవుతారు. అలాగే కర్మభూమికి సేవలు అందించాలి. ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతంలోని స్థానికులతో మమేకం కావడం తెలుగువారి ప్రత్యేకత. ప్రస్తుతం భారతదేశం మినహా అన్ని దేశాల్లోనూ మానవ వనరుల కొరత ఉంది. ఇది మనదేశానికి పెద్ద వరం. ఉద్యోగాలు చేసే వాళ్లుగా కాదు, ఉద్యోగాలు ఇచ్చే వాళ్లుగా తెలుగు జాతి ఎదగాలి. ముఖ్యంగా ఎన్నార్టీలు (ప్రవాస తెలుగువారు) ఈ దిశగా అడుగులు వేయాలి." అని తెలిపారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే, ఒకరు ఉద్యోగం చేయండి.. మరొకరు వ్యాపారం చేయండి అని చంద్రబాబు సూచించారు. కొత్త తరహాలో ఆలోచన చేస్తే పారిశ్రామికవేత్తలుగా రాణించగలరని, జాతి కోసం, దేశం కోసం స్ఫూర్తితో పనిచేయండని పిలుపునిచ్చారు. "విజన్ 2020, ఐటీ గురించి ఆనాడు తీసుకున్న నిర్ణయం వల్ల 195 దేశాలకు తెలుగువారు వెళ్లే అవకాశం లభించింది. 2047కు భారతదేశం ప్రపంచంలో నంబర్ వన్ ఎకానమీగా అవతరిస్తుంది. దేశానికి అత్యంత బలమైన నాయకత్వం మోదీ రూపంలో ఉంది. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని.. యువకులను పార్టీలో.. ప్రభుత్వంలో ప్రోత్సహిస్తున్నాం. అందుకే రామ్మోహన్ నాయుడు, లోకేశ్, టీజీ భరత్‌కు పదవులు దక్కాయి. రామ్మోహన్ నాయుడు కేంద్రంలో యువ మంత్రి. పదవులంటే గ్లామర్ కాదు. రాళ్లు కూడా పడతాయి. వీటిని ఎదుర్కోవడం యువత అలవర్చుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చూపే కమ్యూనిటీగా తెలుగు వాళ్లు ఎదగాలి. రాష్ట్ర ఎన్నికల్లో ఎన్నార్టీలు అద్భుతంగా పనిచేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కల్యాణ్ సహకరించారు. అలాగే బీజేపీ కలిసి వచ్చింది. రాష్ట్రానికి పూర్వవైభవం తేవాలి.. సహకరించాలని ఎన్నార్టీలను కోరితే ఆలోచన చేయకుండా తరలివచ్చారు. రాష్ట్రంలోని నేతలు, కార్యకర్తలతో సమానంగా కొందరు ఎన్నార్టీలు కూడా కేసులు పెట్టించుకున్నారు." "విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి పునర్ నిర్మించడం సాధ్యమా అని అందరూ ఆందోళన చెందారు. కానీ 18 నెలల కాలంలో బ్రాండ్ పునరుద్ధరించాం. పెట్టుబడులు.. అభివృద్ధి విషయంలో మంత్రులు, నేను పోటీ పడుతున్నాం. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. అలాగే దేశానికి వచ్చిన అతి పెద్ద పెట్టుబడి గూగుల్ రూపంలో ఏపీకే వచ్చింది. మిట్టల్ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తోంది. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు కానుంది. ఏఎం గ్రీన్ సంస్థ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. తక్కువ ఖర్చుతో కరెంటు ఉత్పత్తి చేసేలా పరిశ్రమలు స్థాపిస్తున్నాం. తక్కువ ఖర్చుతో విద్యుత్తు కొనుగోళ్లు చేపడుతున్నాం. విద్యుత్తు రంగంలో సంస్కరణలు చేపట్టడం వల్ల డేటా సెంటర్లు రాష్ట్రానికి పెద్ద ఎత్తున వస్తున్నాయి. వివిధ సంస్థలతో మొత్తం రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులపై కసరత్తు చేస్తున్నాం. ఇది సాకారమైతే 20 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఏపీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చి వివిధ దేశాల్లో స్థిరపడిన తెలుగు వారు, వారి ఊళ్లలో ఉన్నవారిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వం రాష్ట్రా న్ని మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి చేస్తోంది." అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సుకు అనూహ్య స్పందన లభించిందంటూ ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ కోర్సు నేర్చుకునేందుకు ఇప్పటివరకూ 50,000 మంది నమోదు చేసుకున్నారని ఆయన సోమవారం ఎక్స్‌లో ప్రకటించారు. 'రాష్ట్రంలో లక్ష మంది క్వాంటం నిపుణుల్ని తయారుచేయడం మా లక్ష్యం. అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సు నేర్చుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం ఆనందం కలిగిస్తోంది. ఈ కోర్సులో బంగారు, వెండి పతకాలు సాధించే నిపుణులను స్వయంగా సత్కరిస్తా' అని చంద్రబాబు పేర్కొన్నారు. "లిక్టన్‌స్టైన్ చాలా చిన్న దేశం. కానీ ప్రపంచంలోనే అది అత్యంత సంపన్న దేశాల్లో ఒకటి.

# పిన్నెల్లి బ్రదర్స్ కు పోలీస్ కస్టడీ

మాచర్ల నియోజకవర్గంలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మాచర్ల కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవాలను రాబట్టేందుకు వీరిని విచారించాలన్న పోలీసుల అభ్యర్థనను న్యాయస్థానం అంగీకరించింది. 2025 మేలో పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో జరిగిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఏ6గా, వెంకట్రామిరెడ్డి ఏ7గా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రాజకీయ కక్షలు, గ్రామంలో ఆధిపత్య పోరు నేపథ్యంలో జరిగిన ఈ హత్యలకు పిన్నెల్లి సోదరులు పరోక్షంగా సహకరించారని పోలీసులు అభియోగాలు మోపారు. ఈ కేసులో పూర్తి నిజాలను వెలికితీయడానికి వారిని కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన మాచర్ల కోర్టు న్యాయమూర్తి, జనవరి 20, 21, 22 తేదీల్లో వారిని విచారించేందుకు పోలీసులకు అనుమతినిచ్చారు. గతంలో ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పిన్నెల్లి సోదరులు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో వారు మాచర్ల కోర్టులో లొంగిపోయారు. తాజా పరిణామంతో ఈ కేసు విచారణలో మరిన్ని వాస్తవాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడిగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న నితిన్ నబీన్‌కు ఈ పదవి లభించడం రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత ఏడాది డిసెంబర్‌లోనే ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినప్పుడు, భవిష్యత్తులో జాతీయ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. ఆ అంచనాలకే అనుగుణంగా, జేపీ నడ్డా పదవీకాలం ముగియగానే పార్టీ అధిష్ఠానం నితిన్ నబీన్‌ను ముందుకు తెచ్చింది. 46 ఏళ్ల వయసున్న నితిన్ నబీన్ బీహార్ రాష్ట్రానికి చెందిన యువ నాయకుడు. ఆయనకు ఆరెస్సెస్ (నాా) నేపథ్యం ఉండటం బీజేపీలో ఆయన ఎదుగుదలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. చిన్న వయసులోనే సంఘ్ పరివార్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న నబీన్, క్రమంగా పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తూ జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారు. పార్టీ సిద్ధాంతాలకు విధేయుడిగా, క్రమశిక్షణతో పనిచేసే నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. నితిన్ నబీన్ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పట్నా జిల్లాలోని బాంకీపూర్ నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వరుస విజయాలతో ఆయనకు ప్రజల్లో మంచి పట్టుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో నబీన్ కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా యువతను పార్టీలోకి ఆకర్షించడంలో, సంస్థాగత బలోపేతంలో ఆయన పాత్రను అధిష్ఠానం ప్రత్యేకంగా ప్రశంసిస్తోంది. జేపీ నడ్డా నాయకత్వంలో బీజేపీ పలు కీలక రాజకీయ దశలను ఎదుర్కొంది. లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ అంతర్గత పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో నడ్డా కీలక పాత్ర పోషించారు. ఆయన పదవీకాలం ముగియడంతో, తదుపరి దశలో పార్టీకి కొత్త నాయకత్వం అవసరమని అధిష్ఠానం భావించింది. ఈ నేపథ్యంలో అనుభవం, సంఘ్ నేపథ్యం, యువతలో ఆదరణ ఉన్న నితిన్ నబీన్‌ను జాతీయ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. నితిన్ నబీన్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న సమయంలో బీజేపీ ముందున్న సవాళ్లు పెద్దవే. రాబోయే లోక్‌సభ ఎన్నికలు, కీలక రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు, విపక్షాల ఐక్యత వంటి అంశాలు పార్టీ ముందున్న ప్రధాన రాజకీయ సవాళ్లుగా ఉన్నాయి. వీటన్నింటిని ఎదుర్కొనేందుకు బలమైన సంస్థాగత నాయకత్వం అవసరమని బీజేపీ భావిస్తోంది.

# దావోస్‌కు బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దావోస్ ఆర్థిక సదస్సు వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పలువురు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, ప్రముఖ బహుళజాతి సంస్థల సీఈవోలు, గ్లోబల్ ఇన్వెస్టర్లతో భేటీ కానున్నారు. ముఖ్యంగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), సెమీకండక్టర్స్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ తయారీ వంటి కీలక రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఈ రంగాల్లో తెలంగాణకు ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, నైపుణ్య వనరులను అంతర్జాతీయ వేదికపై సీఎం వివరించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్య పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత్ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా మారిందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఐటీ, ఫార్మా, బయోటెక్ రంగాల్లో ఇప్పటికే ఉన్న బలమైన ఎకోసిస్టమ్‌ను మరింత విస్తరించడమే లక్ష్యంగా దావోస్ పర్యటన సాగుతోంది. సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తెలంగాణను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఇప్పటికే పలు విధానాలను ప్రకటించింది. వాటిని ప్రపంచ పెట్టుబడిదారులకు వివరించడంతో పాటు, కొత్త ప్రాజెక్టుల కోసం ఒప్పందాలు కుదుర్చుకోవడంపై సీఎం దృష్టి పెట్టారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో సౌర, విండ్ ఎనర్జీ, హైడ్రోజన్ ఇంధనం వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ అనుకూల పరిశ్రమలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశాలన్నింటినీ దావోస్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి గ్లోబల్ కంపెనీల ప్రతినిధులతో చర్చించనున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలోనూ హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు పొందిన నేపథ్యంలో, కొత్త పరిశోధనా కేంద్రాలు, తయారీ యూనిట్ల ఏర్పాటుకు పెట్టుబడులు రాబట్టాలనే ఉద్దేశంతో సమావేశాలు జరగనున్నాయి. దావోస్ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు పలు రౌండ్‌టేబుల్ సమావేశాలు, ద్వైపాక్షిక భేటీల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర విధానాలు, ప్రోత్సాహకాలు, భూసౌకర్యాలు, మౌలిక వసతులపై సమగ్రంగా వివరిస్తారని అధికారులు తెలిపారు. పెట్టుబడులు మాత్రమే కాకుండా, యువతకు ఉపాధి అవకాశాలు పెంచే పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

# శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం





కుత్బుల్లాపూర్, నవతరం: "బిగ్ బాష్" రూఫ్ టాప్ బాక్స్ క్రికెట్ & ఫుట్ బాల్ ను ప్రారంభించారు బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్. 127 రంగారెడ్డి నగర్ డివిజన్ జి.ఆర్.ప్యాలెస్ వద్ద "బిగ్ బాష్" రూఫ్ టాప్ ఫుట్ బాల్ & బాక్స్ క్రికెట్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని ఇలాంటి బాక్స్ క్రికెట్ ను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గౌస్, గాజుల రామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, నవాబ్ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాస్ఫూర్తి క్రమశిక్షణ ను పెంచుతుంది







పటాన్చెరు, నవతరం:36వ మైత్రి క్రికెట్ ట్రోఫీ2026 టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి స్టేడియంలో, మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ మైత్రి క్రికెట్ ట్రోఫీ2026 టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తో పాటు బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, గత 36 సంవత్సరాలుగా నిరంతరంగా ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న మైత్రి క్రికెట్ క్లబ్ నిర్వాహకులను చూసి ఈ తరం యువత నేర్చుకోవాల్సింది చాలా ఉందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఐక్యతను పెంచుతాయని తెలిపారు. అలాగే గ్రామీణ స్థాయిలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇలాంటి టోర్నమెంట్లు మంచి వేదికగా మారుతున్నాయని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో మైత్రి క్రికెట్ క్లబ్ పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సి. సత్యనారాయణ రెడ్డి, కే. సత్యనారాయణ రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ సపన దేవ్, సీనియర్ నాయకులు ప్రకాష్ రావు, ఇక్బాల్, సంజీవ్ రెడ్డి, గూడెం మధు, రుద్రారం శంకర్, విజయ్, కోమరగూడెం వెంకటేష్, నర్రబిక్షపాటి, మల్లేష్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ చారి, ప్రభాకర్, బైండ్ల కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, వంగరి అశోక్, ప్రజాప్రతినిధులు, క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



## సేవా భావం కలిగి మంచి మనసున్న వ్యక్తి ఐటీడీఏ పిఓ తిరుమణశ్రీ పూజకు ప్రజలు ప్రశంసలు

నవతరం:పాడేరు (అల్లూరి జిల్లా) : అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమణశ్రీ పూజ బాధ్యతలు చేపట్టిన నుండి నేటి వరకు ప్రతిరోజు మారుమూల ప్రాంతాల సైతం పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారం చేయడంలో దిట్ట అనే విషయం అందరికీ తెలిసిందే,పిఓ దగ్గరకు వెళ్తే ఏ సమస్య అయినా పరిష్కారం అవుతుంది అనే కోణంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు,అదే తరుణంలో ఐటీడీఏ పీవో సేవా భావం కలిగిన వ్యక్తి ఎదుటివారు ఆపదలో ఉంటే సేవా దృక్పథంతో వారినిఆదుకునేమంచి మనసున్న వ్యక్తి అనడంలో కూడా ఎటువంటి సందేహం లేదు. దానికి నిదర్శనం ఐటీడీఏ పీవో తిరుమణశ్రీ పూజ పాడేరు నుండి అరకు ఒక కార్యక్రమ నిమిత్తం వెళుతుండగా మార్గ మధ్యలో ఒక వృద్ధుడు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో అంత ట్రాఫిక్ లోను అది గుర్తించిన పిఓతిరుమణశ్రీ పూజ తక్షణమే వాహనం నిలిపివేయించిదగ్గరుండి మరి ఆ వృద్ధుడిని రోడ్డు అవతలకు దాటించి ఆయన ఎక్కడికి వెళ్లాలో ఆ వృద్ధుడిని అడిగి తెలుసుకుని ఆ ఆయన స్వగ్రామం వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. ఈ సంఘటన అనే కాదు ప్రతి విషయంలోనూ ప్రజలు ఏ సమస్య మీద వచ్చినా తక్షణమే స్పందించి తమ వంతు సహాయ సహకారాలు అందజేసి వారి సమస్య వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చేసి నిరుపేదల కళ్ళల్లో ఆనందంవెల్లువెత్తేలా చేస్తూ విధులు నిర్వహిస్తున్న ఏకైక అధికారి పాడేరు ఐటీడీఏ పిఓతిరుమణశ్రీ పూజ అని ప్రజలు అభినందనలు తెలియజేస్తూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## సమాజాన్ని మేల్కొని యోగి వేమన నీతి పద్యాలు వేమన పద్యాలు వెలకట్టలేనివి
### ::: ఘనంగా వేమన జయంతోత్సవం

నవతరం: కోటబొమ్మాలి : వేమన పద్యాలు సమాజ అభివృద్ధికి సోపానాలు అని టిడిపి కోటబొమ్మాలి పట్టణ నాయకులు, రోటరాక్ట్ క్లబ్ పూర్వ అధ్యక్షులు నౌగాపు నాగరాజు, తలగాపు ఝాన్సీ మెమోరియల్ వ్యవస్థాపకులు టి. వి. రమణ అన్నారు. వేమన జయంతి సందర్భంగా సోమవారం కోటబొమ్మాలి లో వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ, పేద, ధనిక అసమానతలు , మూఢ విశ్వాసాలను తూర్పుర పట్టిన వేమన పద్యాలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయన్నారు. మూఢ విశ్వాసాలను వీడాలని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి వేమన భవిష్యత్తు ఆలోచన కలిగిన మహా జ్ఞాని అని ప్రముఖ జర్నలిస్ట్ తలగాపు వెంకటరమణ స్పష్టం చేశారు. పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించిన కవి వేమన అన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని వారు ఉండరన్నారు. సమాజం, మానవ సంబంధాలపై యోగి వేమన పద్యాలు ఎంతగానో ప్రభావాన్ని చూపేయని వారు తెలిపారు. వేమన రాసిన పద్యాలు వెలుగులోకి తేవడానికి ఆంగ్లేయుడైన సిపి బ్రౌన్ కృషి మరువ లేమన్నారు. వేమన పద్యాలలో లోక నీతులు, సామాజిక రీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయని, కుటుంబ వ్యవస్థ లోని లోటుపాట్లు, మతం పేరుతో జరుగుతున్న అరాచకాలు, దోపిడీలు, దొంగ సన్యాసులు.. ఇలా కనిపించిన ప్రతి సామాజిక రుగ్మతపై వేమన తన గలాన్ని పద్య రూపంలో రుళిపించారన్నారు. సమ సమాజ నిర్మాణానికి ఎంతో ఉపయుక్తంగా ఉండే వేమన సందేశాన్ని ప్రబలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాలక ప్రభుత్వాలు కృషి చేయాలని వారు కోరారు. రోటరాక్ట్ క్లబ్ పూర్వ ఉపాధ్యక్షులు సుసరాపు సూర్య నారాయణ ( సూరిబాబు ), గాంధీ సేవా సమితి ప్రతినిధులు సకల భక్తుల త్రినాథ్, సకల భక్తుల శ్రీనివాస్, శిరసాల శ్రీనివాస్, రఘుపాత్రుని రామారావు, మురళి, భాస్కర్ పాల్గొన్నారు.


# ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్

Plot No. 174 to 176, phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051. 9391221697

**చదువుకునే పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం**

బి. యన్. రెడ్డి నగర్ ఫేజ్ - 1 ఐకాం ఎదురుగా చర్లపల్లిలో 1996 సం॥లో "ద హోంఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్" అనే విద్యార్థుల వసతి గృహము స్థాపించబడినది. ఈ సంస్థ నగరంలోని దాతల సహకారంతో నడుపబడుచున్నది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమంటే బాగా చదువగలిగి ఉండి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసేవారిని కూలీలుగా కార్మికులుగా మారకుండా సమాజానికి పనికివచ్చే మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని. గ్రామీణ పేద విద్యార్థులకు హైదరాబాద్ నగరంలో ఉండి చదువగలిగే ఆర్థిక స్తోమత లేనివారికి వసతి, భోజనం, పుస్తకాలు, నోట్‌పుస్తకాలు. బస్‌పాస్ మరియు పరీక్షఫీజులు కూడా చెల్లించి వారి భావి జీవితము అత్యున్నతంగా ఉండేలా తీర్చిదిద్దాలని మా ఆశయం.

ఇందులో అడ్మిషన్ పొందగలిగే విద్యార్థులకు కులము. మతము పట్టింపులు ఏమీ ఉండవు. ఇందులో చదువుకోదలచిన విద్యార్థులకు నగరంలో ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొంది ఉండవలెను మంచి మార్కులు వచ్చిన అనాథ విద్యార్థులకు తల్లి లేదా తండ్రి లేనివారికి గ్రామీణ పేద విద్యార్థులకు మేనేజిమెంట్ తరవున కళాశాల యాజమాన్యంతో సంప్రదించి వీలైతే ఏదైనా మంచి కళాశాలలో ఫ్రీ అడ్మిషన్ ఇప్పించుటకు మా వంతు కృషి చేయగలము.

ఈ సంస్థ స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఇందులో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననల్ని పొందుచున్నారు సుమారు 400 మంది గత 29 సం॥లలో ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు

ఇందులో అడ్మిషన్ కోరకై విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి (ఇంటర్ 1. 2. ఏదైనా డిగ్రీ ఫస్ట్ ఇయర్‌వారు) దరఖాస్తుకు అర్హులు గ్రామీణ అనాధ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది తల్లి లేదా తండ్రి లేని నిరుపేద విద్యార్థులు. పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చును. విద్యార్థులు తమ మార్కులకు సంబందించిన మెమో. అదే విధంగా బోనోఫైడ్ సర్టిఫికేట్స్ (ప్రస్తుతం చదువుతున్న కళాశాలకు సంబంధించినది), తల్లిదండ్రులు లేనిచో మరణ ధృవీకరణ పత్రము ఆదాయం సర్టిఫికేట్ (ఎం.ఆర్.ఓ. గారిచే ధృవీకరించబడినది అయి ఉండాలి). అన్ని సర్టిఫికేట్స్ యొక్కజిరాక్స్ కాపీలను మరియు రెండు పాస్‌పోర్టుసైజు పోటోలను పోంత చిరునామా కలిగిన స్టాంపులు అంటించి కవరును పోస్టు ద్వారాగాని. ఇమెయిల్ ద్వారాగాని. వాట్సప్ (9391221697) ద్వారాగాని. స్వయంగా గాని పైన ఉన్న చిరునామాకు వెంటనే పంపించగలరు. పూర్తి వివరాలకుపైన నెంబర్లకు సంప్రదించగలరు.

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అడ్రస్ కొరకు SCAN చేయండి

మనవి : కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు చదువుకునే పదవతరగతిలో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులను ప్రోత్సహించి మా హోం కు పంపించగలరు.

గమనిక: ఈ వసతి కేవలం బాలురుకు మాత్రమే

Bittu Digitals Aler - 8919441120


# బొలెరో ఢీకొని 35 గొర్రెలు మృతి

పాయకరావుపేట: మండలంలోని సీతారాంపురం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 35 గొర్రెలు మృతి చెందాయి. వేగంగా వచ్చిన బొలెరో వాహనం గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో ఈఘోరం జరిగింది. ఈఘటనలో గొర్రెల యజమానికి తీవ్ర గాయాలవ్వగా, సుమారు 40 గొర్రెల మందలో 35అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనంతో పరారయ్యాడు.బాధితుడికి భారీగా ఆర్థిక నష్టం వాటిల్లింది.పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న బొలెరో కోసం గాలిస్తున్నారు.




# ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్ | THE HOME FOR ORPHAN STUDENTS

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.



పదవ తరగతి పై బడిన చదువుతున్న ఇంటర్మీడియట్/ఐ.టి.ఐ/ పాలిటెక్నిక్/ డిగ్రీ/ ఇంజనీరింగ్/ పారా మెడికల్ కోర్సులు/ పి.జి కోర్సులు.

A golden Opportunity for Orphaned and underprivileged students studying Intermediate, ITI, Polytechnic, Degree, Engineering, Paramedical, or PG Courses after completing 10th class.

హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న అనాథ/ పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం.

Students Studying in Government or Private Colleges in Hyderabad are Eligible.

మానవత్వం సహృదయం గల దాతల హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడుచున్న సంస్థ. గత 30 సం॥లలో సుమారు 400 మంది విద్యార్థులు ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు.

With the support of kind-hearted and humanitarian donors, an organization is being run since last 30years about 400plus students studied and well setteled down happily in life.

బాలురకు మాత్రమే

ఉచిత వసతి, భోజనం, బస్‌పాస్, సౌకర్యాలతో

SCAN HERE For ADDRESS

ONLY FOR BOYS

Free Accommodation
Free Meals
Free Bus Pass
Other Essential Facilities.

అడ్మిషన్ల కొరకు పైన పేర్కొన్న అడ్రస్ లో సంప్రదించగలరు. | For Addmissions Please Contact the Address Mentioned Above

Cell: 9391221697

# అంగదుడ్ని కాపాడమన్న వాలి



**"న చ ఆత్మానం అహం శోచే న తారాం న అపి బాంధవాన్,**

**యథా పుత్రం గుణశ్రేష్ఠం అంగదం కనకాంగదంవ"**

రాముని బాణానికి కిందపడిపోయిన వాలి "రామా! 'నా ప్రాణాలు పోతున్నాయి' అని బాధపడడం లేదు, తార గురించి విలపించడం లేదు, కాని నా ప్రియాతిప్రియమైన కుమారుడు అంగదుడు సుఖాలకి అలవాటుపడి బతికినవాడు, 'ఈ ఒక్క కొడుకు భవిష్యత్తు ఏమవుతుందా?' అని బెంగపడుతున్నాను. నా కొడుకు శ్రేయస్సుని, అభివృద్ధిని నువ్వే సర్వకాలముల యందు చూడాలి రామా" అని ప్రాధేయపడ్డాడు.

"దండించవలసిన నేరం ఏదన్నా చేసినప్పుడు, ఆ దండనని అవతలి వ్యక్తి రాజ్యం నుంచి కాని, రాజు నుండి కాని పొందితే, వాడి పాపం అక్కడితో పోతుంది. ఒకవేళ దండన పొందకపోతే ఆ పాపం ఫలితాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉంటుంది. అందుచేత, వాలీ నువ్వు అదృష్టవంతుడివి. నువ్వు చేసిన మహా పాపానికి ఎప్పుడైతే శిక్ష అనుభవించావో, అప్పుడే నీ దోషం పోయింది. అందుకని ఇప్పుడు నువ్వు శరీరాన్ని విడిచిపెట్టాక స్వర్గలోకాన్ని పొందడానికి నీకెటువంటి ప్రతిబంధకం ఉండదు. ఇప్పుడు అంగదుడు నిన్ను ఎలా చూసేవాడో, నీ తరవాత సుగ్రీవుడియందు, నాయందు అలాగే ఉంటాడు. పిన తండ్రివల్ల నీ కుమారుడికి సమస్య రాదు. ఒక వేళ వస్తే నీ బిడ్డని తండ్రిగా కాపాడడానికి నేను ఉన్నాను" అని రాముడు వాలికి హామీ ఇచ్చాడు.

అలా వాలి కిందపడిపోవడంతో వానరాలలో కలకలం రేపింది. ఈ గందరగోళం విన్న తార బయటకి వచ్చి "మీరందరూ ఇలా ఎందుకు పరిగెడుతున్నారు" అని అడిగింది. అప్పుడు ఆ వానరాలు "రాముడికి, వాలికి యుద్ధం జరిగింది.ఆ యుద్ధంలో ఆఖరున రాముడు వాలిమీద బాణమేసి కొట్టాడు.అందుకని నీ కొడుకుని రక్షించుకో, పారిపో" అన్నారు. అప్పుడు తారడ "భర్తపోయిన తరువాత నాకెందుకు ఈ రాజ్యం, ఈ కొడుకు" అని వాలి దగ్గరికి పరిగెత్తింది.అప్పుడా తార వాలితో "నేను నీకు చెప్పిన మాటలు నువ్వు వినలేదు, ఇప్పుడు ఈ పరిస్థితిని తెచ్చుకున్నావు. సుగ్రీవుడి భార్యని అపహరించి తెచ్చావు, కామానికి లొంగావు" అని చెప్పి, కొన ఊపిరితో ఉన్న వాలిని చూసి విలపించింది. తండ్రి మరణిస్తున్నాడని అంగదుడు భోరున విలపిస్తున్నాడు.

అప్పుడు వాలి సుగ్రీవుడితో

"సుగ్రీవా! నా దోషాలని లెక్కపెట్టకయ్యా. కాలం బలవత్తరమైన స్వరూపంతో తన ఫలితాన్ని ఇవ్వడానికి నా బుద్ధిని మోహపెట్టి, నీతో వైరం వచ్చేటట్టు చేసింది.

నీ నుండి నన్ను దూరం చేసింది. అన్నదమ్ములమైన మనిద్దరమూ కలిసి బతికే అదృష్టం దేవుడు ఇవ్వలా. నేను వెళ్ళిపోయే సమయం ఆసన్నమయ్యింది.నీకు ఒక్క మాట చెబుతాను, సుగ్రీవా, జాగ్రత్తగా విను. నాకు ఒక్కడే కొడుకు అంగదుడు, వాడు ఇవ్వాళ నాకోసం భూమి మీద పడి కొట్టుకుంటున్నాడు. వాడు సుఖంలో పెరిగాడు, నేను వెళ్ళిపోయాక వాడికి నీ దగ్గర ఎలా ఉండాలో తెలియదు కదా. తార బతుకుతుందో లేదో నాకు తెలియదు. అందుకని నా కొడుకుని జాగ్రత్తగా చూడు, వాడికి నువ్వే రక్షకుడివి. తారకి ఒక గొప్ప శక్తి ఉంది సుగ్రీవా. ఎప్పుడెఐనా ఒక గొప్ప ఉత్పాతం వస్తే సరైన సలహా ఇస్తుంది. నువ్వు ఎప్పుడైనా కాని రాముడిని అవమానించావా, రాముడి పని చెయ్యడంలో ఆలస్యం చేయవద్దు, జాగ్రత్తగా ఉండు.

నా తండ్రి మహేంద్రుడు ఇచ్చిన మాల

నా మెడలో ఉంది, నా ప్రాణం కాని వెళ్ళిపోతే, ఈ శరీరం శవం అయిపోతుంది, అప్పుడీ మాల అపవిత్రం అవుతుంది. ఈ మాల జయాన్ని తీసుకొస్తుంది అందుకని నీకు ఇస్తున్నాను, తీసుకో" అని ఆ మాలని సుగ్రీవుడికి ఇచ్చి ప్రాణాలు వదిలాడు.

అప్పుడు తార "ఎప్పుడూ నీ నోటివెంట ఒక మాట వచ్చేది.

'సుగ్రీవుడిని చితక్కొట్టేస్తాను' అనేవాడివి. చూశావా దైవ విధి అంటే ఎలా ఉంటుందో, ఇవ్వాళ ఆ సుగ్రీవుడు నిన్ను కొట్టేశాడు. ఒంట్లో బలం ఉందని లేచింది మొదలు సంధ్యావందనానికి నాలుగు సముద్రాలు దూకావు. ఇంటికొచ్చి మళ్ళీ ఎవరినో కొట్టడానికి వెళ్ళేవాడివి. నీతో యుద్ధం చేసిన ఎందరో వీరులని ఇలా భూమి మీద పడుకోపెట్టావు, ఇవ్వాళ నువ్వు కూడా అలా పడుకున్నావు. శూరుడన్న వాడికి పిల్లని ఇస్తే, ఆమెకి హఠాత్తుగా వైధవ్యం వస్తుంది. అందుకని శూరుడికి ఎవరూ పిల్లని ఇవ్వద్దు."

"మాటవినే కొడుకులు ఎంతమంది ఉన్నా, అపారమైన ఐశ్వర్యం ఉన్నా, నేను గొప్ప పండితురాలినైనా, నువ్వు వెళ్ళిపోవడం వల్ల లోకం నన్ను చూడగానే మాత్రం విధవ అనే అంటుంది" అనింది.

అప్పుడు సుగ్రీవుడు రాముడితో

"నువ్వు చేసిన ప్రతిజ్ఞకి అనుగుణంగా వాలిని సంహరించావు. అన్నని చంపమని నేను నిన్ను అడిగాను, నేను దుర్మార్గుడిని. ఇప్పుడు నాకు తెలుస్తోంది నేను ఎంత అకృత్యం చేశానో అని. అన్నయ్య బతికి ఉన్నంతకాలం, అన్నయ్య పెట్టిన కష్టాలు తట్టుకోలేక, 'అన్నయ్య పోతే బాగుండు, ' అని నిన్ను తీసుకొచ్చి బాణం వెయ్యమన్నాను. అన్నయ్య భూమి మీద పడిపోయాక, అన్నయ్య ఆప్యాయత అంటే ఏమిటో తెలిసింది.

నేను వాలితో యుద్ధానికి వెళితే, నన్ను కొట్టి, ఇంకొక్క గుద్దు గుద్దితే నేను చచ్చిపోతాను అన్నంతగా అలిసిపోయాక, 'ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యకే, పో ' అని వెళ్ళిపోయేవాడు, కాని నన్ను చంపేవాడు కాదు. ఒకతల్లి బిడ్డలమని నన్ను ఎన్నడూ వాలి చంపలేదు. తన దెబ్బలకు నేను చచ్చిపోతానని తెలిసి వాలి నన్ను అన్నిసార్లు వదిలేశాడు, కాని నేను వాలిని చంపించాను. నీతో వాలిని చంపమని చెప్పినప్పుడు నాకు ఈ బాధ తెలియలేదు, కాని జరిగినప్పుడు తెలుస్తోంది. అందుకని నాకు ఈ రాజ్యం వద్దు రామా అన్నాడు.

నా అన్న నన్ను కొట్టి, ఇంక నేను ఆ దెబ్బలు తట్టుకోలేక పడిపోతే,

'ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు పనులు చెయ్యకు, పో ' అనేవాడు. ఇవ్వాళ నన్ను అలా అనే అన్నయ్య ఎక్కడినుంచి వస్తాడు. ఇక నేను ఉండను, నేను అగ్నిలోకి పోతాను. రామా! మిగిలిన ఈ వానరులు నీకు సీతాన్వేషణలో సహాయం చేస్తారు" అన్నాడు.

సుగ్రీవుడు అలా ఏడుస్తుంటే చూడలేక రాముడు కూడా దుఃఖించాడు.

రాముడి బాణం వాలి గుండెలకి గుచ్చుకొని ఉంది. అప్పుడు నలుడు వచ్చి ఆ బాణాన్ని తీసేసాడు. అప్పుడా తార భర్త శరీరం కౌగలించుకుని రోదించింది. రాముడి దగ్గరికి వచ్చి "రామా! నీగురించి ఊహించడం ఎవరి శక్యం కాదు. నీ చేతిలో పట్టుకున్న కోదండం, నీ రూపం, కాంతి చూసిన తరువాత నువ్వు అందరివంటి మనుష్యుడవి కావని నేను గుర్తించాను. నేను లేకపోతే వాలి అక్కడ కూడా సంతోషాన్ని పొందలేడు. అందుకని వాలిని ఏ బాణంతో కొట్టావో, నన్ను కూడా ఆ బాణంతో కొట్టు, నేనూ వాలి దగ్గరికి వెళ్ళిపోతాను" అన్నది.

అప్పుడు రాముడు "నువ్వు అలా శోకించకూడదమ్మా. కాలం అనేది ఒక బలమైన స్వరూపం, అది పుణ్యపాపాలకి ఫలితాన్ని ఇస్తుంది. ఇక్కడ వాలి శరీరం ఇలా పడి ఉండగా మీరందరు ఇలా మాట్లాడకూడదు. జరగవలసిన క్రతువుని చూడండి" అన్నాడు.

తరువాత వాలి శరీరాన్ని అగ్నికి ఆహుతి చేశారు.

తదనంతరం సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన వానరాలు రాముడి దగ్గర కూర్చున్నారు.

అప్పుడు హనుమంతుడు

"ఇంతగొప్ప రాజ్యాన్ని సుగ్రీవుడు పొందేతట్టుగా నువ్వు అనుగ్రహించావు. అందుకని నువ్వు ఒక్కసారి కిష్కిందా నగరానికి వస్తే నీకు సత్కారం చేసి నీ పాదాలకి నమస్కరించి సుగ్రీవుడు కృతకృత్యుడు అవుతాడు" అని అన్నాడు.

అప్పుడు రాముడు "14 సంవత్సరాలు తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం అరణ్యంలో ఉంటాను. నేను గ్రామంలో కాని, నగరంలో కాని ప్రవేశించరాదు.అక్కడ నిద్రపోరాదు. పెద్దవాడైన వాలి కొడుకైన అంగదుడు యోగ్యుడు, మీరు అతనికి యువరాజ పట్టాభిషేకం చెయ్యండి. సుగ్రీవుడికి రాజ్య పట్టాభిషేకం చెయ్యండి. మీరందరు సంతోషంగా కిష్కిందలో ఉండండి. ఈ వర్షాకాలంలో రావణుడిని వెతుకుతూ వెళ్ళడం కష్టం. సుగ్రీవా! పట్టాభిషేకం చేసుకొని 4 నెలలు యదేచ్ఛగా సుఖాలు అనుభవించు. కొండల మీద తిరిగి ఎన్నాళ్ళ నుంచి కష్టపడ్డావో. 4 నెలల తరువాత కార్తీక మాసం వచినప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకో. అంతవరకు నేను ఊరి బయట పర్వత గుహలో ఉంటాను" అని చెప్పి సుగ్రీవుడిని పంపించాడు.

కిష్కిందకి వెళ్ళాక సుగ్రీవుడికి పట్టాభిషేకం చేశారు. సుగ్రీవుడు మళ్ళీ తారని పొందాడు. అలా తార, రుమలతో సుగ్రీవుడు ఆనందంగా కాలం గడపసాగాడు.

– యం.వి.రామారావు

# మద్యంపై మారని ప్రభుత్వ తీరు

## సిపిఐ నాయకులు కె నారాయణ



నవతరం ఖమ్మం భద్రాద్రి జిల్లా : మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా చూస్తూ ప్రజలను దోచుకుంటున్నారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డా.కె నారాయణ తెలిపారు. సోమవారం ఖమ్మంలో వైన్ షాపులను ఆయన సందర్శించారు. ప్రభుత్వాలు మారిన లిక్కర్ పాలసీలో మాత్రం మార్పులు రావడం లేదన్నారు. గత ప్రభుత్వాల కంటే లిక్కర్ ద్వారా ప్రస్తుత ప్రభుత్వాలు మరింత ఆదాయాన్ని సంపాదించాలని ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు.గత ప్రభుత్వం పెట్టిన బెల్ట్ పులను ఎత్తివేస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీని మరిచిపోయారని నారాయణ తెలిపారు. లక్ష రూపాయల డిపాజిట్ సొమ్మును ఈ ప్రభుత్వం పెంచిందని బెల్ట్ షాపులను కూడా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బార్ షాపుల వద్ద మద్యం వ్యాపారాలను పెంచుకునేందుకు ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని మద్యం దుకాణాల పక్కనే బార్లను తలపించే రీతిలో సిట్టింగ్ లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. కుటుంబాలు ఛిద్రమవుతున్న పాలకులకు పట్టడం లేదని ఆయన తెలిపారు. మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకునే పద్దతిని ప్రభుత్వాలు విడనాడాలని నారాయణ డిమాండ్ చేశారు. మద్యాన్ని కూడా అధిక ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియులను దోచుకుంటున్నారన్నారు. మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యాన్ని బెల్ట్ షాపుల్లో ఉంచి ఎంఆర్పి కంటే అధిక ధరకు విక్రయిస్తున్నారని ఒక్కో బాటిల్ పై రూ. 25 ల నుంచి రూ. 50ల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నారాయణ వెంట సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్ రావి శివరామకృష్ణ సిపిఐ నాయకులు మడుపల్లి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



## యోగివేమన జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి

నవతరం :విశాఖపట్నం : దార్శనికుడు ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగివేమన జయంతి సందర్భంగా నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., గారు పోలీస్ కమిషనరేట్ ఆవరణలో వడ్డే ఓబన్న గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడు యోగి వేమన పోలీసు కమిషనర్ గారు కొనియాడారు. ఈ సందర్భంగా సీపీ గారు యోగి వేమన గారిని స్మరించుకుంటూ 350 సంవత్సరాల క్రితమే సమాజంలోని మూఢాచారాలను నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని, విశ్వదాభిరామ వినురవేమా అంటూ ఆయన చెప్పిన నీతి సూత్రాలు అనుసరణీయమన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

# మల్లన్న జాతరలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్





పటాన్చెరు, నవతరం: నియోజకవర్గ పరిధిలోని ఐనోల్ మరియు రాళ్లకత్వ గ్రామాలలో అత్యంత వైభవంగా నిర్వహించిన మల్లన్న జాతర మహోత్సవంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని, మల్లన్న స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజల నుంచి మాద్రి పృథ్వీరాజ్ కు ఘన స్వాగతం లభించగా, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని తెలియజేశారు. సాంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.




## అక్రమ కట్టాడాలపై చర్యలు తీసుకోండి

### డిప్యూటీ కమిషనర్ కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుడ్డు రాహుల్ ఫిర్యాదు

దుండిగల్, నవతరం: ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు దుడ్డు రాహుల్ ఫిర్యాదు చేశారు. గండిమైసమ్మ దుండిగల్ జి హెచ్ ఎమ్ సి సర్కిల్ 294 పరిధిలో శంకర్ నగర్ సర్వే నంబర్ 62లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై మరియు బహదూర్ పల్లి గ్రామంలోని పిర్జది కుంట సర్వే నంబర్ 142 ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు మరియు పిర్జాది కుంట లో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని లేకపోతే నగరంలో మాయమైపోయిన అనేక చెరువులలో ఒకటిగా ఇక్కడ ఒకప్పుడు పిర్జాది కుంట ఉండేది అని చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతుందని పిర్జాది కుంటలో నీటి నిల్వ వలన బహదూర్ పల్లి గ్రామానికి భూగర్భ జలాలు ఎండిపోకుండా కాపాడుతుందని దుడ్డు రాహుల్ డిప్యూటీ కమిషనర్ కు వివరించారు, గతంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఆక్రమణదారులు జె సి బి మరియు వాహనాలతో మట్టిపోసి రోడ్డు నిర్మాణం చేసి మరింత ఆక్రమణ చేస్తుండటంతో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బహదూర్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు దుడ్డు రాహుల్ దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నాయక్ ను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.

# రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు అమలుచేయాలి

## మహా ఎమ్ఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యపాగ నర్సింగ్ రావ్ మాదిగ



కుత్బుల్లాపూర్, నవతరం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి ఎచ్ ఏం సి, మున్సిపల్ ఎన్నికలు రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగా లేవు 2011 సెన్సస్ ప్రకారం దళితులకు 15% రిజర్వేషన్ కల్పించి, జి ఎచ్ ఏం సి 300 వార్డు లకు 45, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో 306 వార్డు లు దళితులకు రిజర్వ్ చేయాలని మహా ఎమ్మార్పీఎస్ గా కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చి దళితులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో గత 3 పర్యాయాలు ఒక వార్డు కూడా దళితులకు కేటాయించలేదు ఇప్పుడు వార్డు లు పెరిగాయి కబ్బటి ఇప్పుడైనా మాకు దళితులకు రాజ్యాంగం బద్దంగా రావాల్సిన 15% రిజర్వేషన్ కల్పించాలని కోరాం అని మహా ఎమ్ ఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యపాగ నర్సింగ్ రావ్ మాదిగ మీడియా ముఖంగా తెలియచేశారు.

# అశ్వారావుపేట ఫ్యాక్టరీల్లో రాక్షస పాలన

**కార్మికుల రక్తం తాగుతున్న యాజమాన్యాలు**

**అశ్వారావుపేటలో 'ఎర్ర' రాజకీయం.. కార్మికుల కడుపు కొడుతున్న నాయకులు?**

**50 ఏళ్లు దాటినా కార్మిక సంఘాల యూనియన్లు లేకపాయే**

**అశ్వారావుపేట పరిశ్రమలో ఆగని దోపిడీ**

**నాయకుల నిశ్శబ్దం వెనుక అసలు రహస్యం అదేనా?**

**ఈ పరిశ్రమలను నడుపుతున్న కార్మికుల బతుకులు మాత్రం అంధకారంలోనే**

**వేతన చెల్లింపుల చట్టం 1936, ట్రేడ్ యూనియన్ యాక్ట్ 1926 కు సరైన సమాధానం ఏది?**







**నవతరం,ఖమ్మం భద్రాద్రి జిల్లా**

అశ్వారావుపేట మండల కేంద్రంలో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న పరిశ్రమలు నేడు కార్మికుల పాలిట శ్మశానాలుగా మారుతున్నాయి. దాదాపు 50 ఏళ్లుగా ఇక్కడి పేపర్ బోర్డ్, కెమిలాయిడ్స్, హెర్బెక్స్ వంటి ఫ్యాక్టరీలు లాభాల బాటలో నడుస్తున్నా, వాటిని నడుపుతున్న కార్మికుల బతుకులు మాత్రం అంధకారంలోనే ఉన్నాయి. ఆ తదుపరి పామాయిల్ ఫ్యాక్టరీ కూడా ఇక్కడ వెలసింది. 'సమాన పనికి సమాన వేతనం' అంటూ గొంతు చించుకునే ఎర్రజెండా పార్టీల నాయకులు.. తెరవెనుక యజమాన్యాలతో కుమ్మక్కై కార్మికుల శ్రేయస్సును తాకట్టు పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నియంతృత్వ పోకడలు.. అడిగే దిక్కులేని అన్యాయం!

ఈ ఫ్యాక్టరీల్లో కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. కనీసం యూనియన్లు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ కూడా కార్మికులకు లేదు. ఏదైనా వ్యక్తిగత అత్యవసర కారణంతో లేదా అనారోగ్యంతో కార్మికుడు రెండు రోజులు విధులకు హాజరుకాకపోతే, యజమాన్యం అమానుషంగా ప్రవర్తిస్తోంది. "నీ ఇష్టం ఉంటే రా.. లేదంటే మానేయ్" అంటూ బెదిరింపులకు దిగడమే కాకుండా, అంతకుముందు చేసిన పనికి సంబంధించిన వేతనాన్ని కూడా చెల్లించకుండా మొండికేస్తోంది. పొట్టకూటి కోసం వెళ్లిన పేద కార్మికుడి శ్రమను ఇలా అడ్డగోలుగా దోచుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు.

ఎర్రజెండా నీడలో ఎత్తుగడలు!

స్థానికంగా ఉన్న ఎర్ర పార్టీలు కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కార్మికులకు అండగా నిలవాల్సిన ఈ పార్టీల నాయకులు, ఫ్యాక్టరీ యజమానుల వద్ద నుండి 'ముడుపులు' అందుకుంటూ మౌనం వహిస్తున్నారని కార్మికులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. యూనియన్లు ఏర్పడకుండా అడ్డుపడటంలో ఈ నాయకులే కీలక పాత్ర పోషిస్తున్నారని, యాజమాన్యాల ప్రయోజనాలే పరమావధిగా వీరు పని చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

**ప్రశ్నిస్తే వేటు.. భద్రత కరువు!**

ప్రశ్నించే గొంతుకలను యాజమాన్యం అణచివేస్తుంటే, రక్షించాల్సిన నాయకులు కాసుల కక్కుర్తితో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కార్మికుల భవిష్యత్తును గాలికి వదిలేసి, తమ జేబులు నింపుకుంటున్న ఈ 'ఎర్ర' నాయకుల వైఖరిపై సామాన్యులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, కార్మిక శాఖ అధికారులు స్పందించి అశ్వారావుపేటలోని పరిశ్రమల్లో కార్మికుల హక్కులను కాపాడాలని, అలాగే యూనియన్ల ఏర్పాటుకు సహకరించాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తోంది.

**ఐటీసీ పేపర్ బోర్డు:**

భద్రాచలం దగ్గర ఉన్న ప్రధాన యూనిట్కు అనుబంధంగా లేదా దానికి సంబంధించిన ముడి సరుకు సేకరణ కేంద్రంగా ఈ ప్రాంతం కీలకపాత్ర పోషిస్తుంది.

**కెమిలాయిడ్స్:**

ఇది ఒక ఫార్మాస్యూటికల్/కెమికల్ కంపెనీ. ప్రధానంగా మొక్కల నుంచి లభించే సమ్మేళనాలను ఔషధాల తయారీలో వాడేలా ఇక్కడ ప్రాసెస్ చేస్తారు.

**హెర్బక్స్:**

ఇది కూడా వ్యవసాయ ఆధారిత పరిశ్రమ.ఇక్కడ విత్తన శుద్ధి లేదా వివిధ రకాల విత్తనాల ఉత్పత్తికి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతుంటాయి. ఈ పరిశ్రమల వల్ల అశ్వరావుపేట కేవలం మండల కేంద్రం గానే కాకుండా ఒక చిన్న పారిశ్రామిక హబ్ గా కూడా గుర్తింపు పొందింది.

ఈ పరిశ్రమంలో కార్మికుల బతుకులు చిద్రమవుతున్నాయి. లాభాల వేటలో పడ్డ యాజమాన్యాలు కార్మికులను మనుషులుగా కూడా చూడడం లేదు. దశాబ్దాలుగా ఇక్కడ బాగా వేసిన పరిశ్రమల్లో అరాచకం రాజ్యమేలుతోంది. దీనికి తోడు కార్మికుల పక్షాన నిలవాల్సిన ఎర్రజెండా నాయకులు యాజమాన్యాల వద్ద కట్టలు తెంచుకుంటున్న ముడుపులకు ఆశపడి, కార్మికుల గొంతు నొక్కుతున్నారని చేదు నిజం వెలుగులోకి వచ్చింది. సంఘం కృష్ణమూర్తి పై అమానుషం: స్థానిక పేపర్ బోర్డులో పనిచేస్తున్న సంఘం కృష్ణమూర్తి అనే నాయకుడికి ఎదురైన అనుభవం ఇక్కడి అరాచకానికి పరాకాష్ట. కొన్ని అనివార్య కారణాలవల్ల ఆయన విధులకు హాజరు కాలేకపోతే మానవత్వం లేని యాజమాన్యం ఆయనను పనిలో నుంచి తొలగించడమే కాకుండా అంతకుముందు కష్టపడి చేసిన పనికి రావలసిన ఐదువేల రూపాయల నుండి 6 వేల రూపాయల వరకు వేతనాన్ని నిలిపివేసింది. నువ్వు డ్యూటీ కి రాలేదు కాబట్టి నీ జీతమే నీకు జరిమానా అంటూ కడుపు కొట్టారు. చమటోడ్చి పనిచేసిన డబ్బులు అడిగితే వెళ్ళగొట్టడం ఏ చట్టంలో ఉందని కార్మిక వర్గం ప్రశ్నిస్తోంది. అలాగే రెండు నెలల క్రితం సాధిక్ బాబా అనే వ్యక్తి ఆవేదన: చెయ్యి పోయిన కరగని యాజమాన్యం. మరో హృదయ విదారక ఘటనలో సాదిక్ బాబా అనే కార్మికుడు విధి నిర్వహణలో భాగంగా తన చేతిని కోల్పోయాడు. నిండు జీవితం అంగవైకల్యంతో కృంగిపోతుంటే ఆదుకోవలసిన యాజమాన్యం కనీస సాయం చేయడానికి కూడా ముందుకు రాలేదు. నెలల తరబడి నరకయాతన అనుభవించిన తర్వాత ఇన్నాళ్లకు తిరిగి అతడు విధుల్లోకి తీసుకున్నారు తప్ప జరిగిన ప్రమాదానికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదు. కార్మికుడి ప్రాణం మీదకు వస్తే పట్టించుకోని ఈ ధోరణి చూస్తుంటే ఇక్కడ కార్మిక చట్టాలు అమలులో ఉన్నాయా లేక యజమానుల చట్టాలు నడుస్తున్నాయా అన్న అనుమానం కలుగుతుంది. ఎర్ర నాయకుల ముడుపుల మౌనం?

ఇంత జరుగుతున్నాసిపిఐ, సిపిఎం,సిపిఐ ఎంఎల్ వంటి పార్టీల నాయకులు మిన్న కుండిపోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆరోపణలు వస్తున్నాయి. యూనియన్లు ఏర్పడితే కార్మికులకు బలం వస్తుందని అప్పుడు యాజమాన్యాల దగ్గర తమకు అందే కమిషన్లు ఆగిపోతాయని భయంతో ఈ నాయకులు ఊసే ఎత్తడం లేదు. కార్మికుడికి కష్టం వస్తే పోరాటం చేయాల్సిన ఎర్రజెండా నేడు యజమానుల గల్లా పెట్టెలకు కాపలా కాస్తుందని స్థానికులు విమర్శిస్తున్నారు. కార్మికుల డిమాండ్: అశ్వారావుపేటలోని పేపర్ బోర్డు, కెవిలాయిడ్స్, హెర్బెక్స్ పామాయిల్ వంటి పరిశ్రమలపై తక్షణమే లేబర్ కమిషనర్ తనిఖీలు చేపట్టాలి. సంఘం కృష్ణమూర్తికి రావాల్సిన వేతనాన్ని ఇప్పించడంతోపాటు సాదిక్ బాబాకు తగిన నష్టపరిహారం అందేలా చూడాలి. ఇలా ఒకరిద్దరు కాదు వందల మంది కార్మికుల పరిస్థితి గోడ మీద దీపంలా మారింది. ఏళ్ల తరబడి శ్రమిస్తున్న ఫలితం తగ్గడం లేదని కార్మిక చట్టాలు ఇక్కడ చుట్టాల చుట్టాలుగా మారాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎర్రజెండా పార్టీలు ట్రేడ్ యూనియన్లు క్రియాశీలకంగా లేకపోవడం యాజమాన్యాలతో చేతులు కలపడం వల్ల కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**వేతనాల పెంపు మృగ్యమేనా:**

ఈ ఫ్యాక్టరీలలో దశాబ్దాలుగా పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులతో పాటు అధిక సంఖ్యలో ఉన్న తాత్కాలిక కార్మికుల జీతాలు ఏమాత్రం పెరగడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సి ఉన్న యాజమాన్యాలు మొండివైఖరిన అవలంబిస్తున్నాయని వారు వాపోతున్నారు. యూనియన్లు పేరుకే ఉన్న కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి అనేది బహిరంగ రహస్యం.నాయకులు తమ స్వార్ధ రాజకీయాలను పక్కనపెట్టి కార్మికుల శ్రేయస్సు కోసం యూనియన్లు ఏర్పాటు చేయని పక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు తప్పవని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

# చందమామ చెంతకు మళ్ళీ మనిషి..

**ఫిబ్రవరి 6న నాసా ప్రయోగం.**

**చంద్రుడి చుట్టూ 10 రోజుల ప్రయాణం**

**ఎస్ ఎల్ ఎస్ రాకెట్ శక్తి పరీక్ష**

**తొలి మహిళ & తొలి నల్లజాతీయుడు చంద్ర కక్ష్యలోకి**

**ఆర్టెమిస్-3కు మార్గం సుగమం**




నవతరం బ్యూరో చీఫ్ : అంతరిక్ష పరిశోధన చరిత్రలో 2026 సంవత్సరం ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. సుమారు అర శతాబ్దం క్రితం అపోలో మిషన్ల ద్వారా మనిషి చంద్రుడిపై అడుగుపెట్టిన తర్వాత, మళ్ళీ అంతటి సాహసోపేతమైన ప్రయాణానికి అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా (నాసా) సర్వం సిద్ధం చేసింది. తన 'ఆర్టెమిస్' ప్రోగ్రామ్‌లో భాగంగా అత్యంత కీలకమైన 'ఆర్టెమిస్-2' మిషన్‌ను ఫిబ్రవరి 6, 2026న ప్రయోగించడానికి ముహూర్తం ఖరారైంది. ఈ చారిత్రాత్మక ప్రయాణంలో నలుగురు వ్యోమగాములు చందమామ కక్ష్యలోకి వెళ్లి రానుండడం విశేషం. ఈ మిషన్ ప్రాధాన్యతను పరిశీలిస్తే, ఇది కేవలం చంద్రుడి చుట్టూ తిరగడమే కాకుండా, భవిష్యత్తులో చంద్రుడిపై శాశ్వత స్థావరాలను ఏర్పాటు చేయడానికి , అంగారక గ్రహం (మార్స్) వైపు మానవ ప్రస్థానాన్ని మొదలుపెట్టడానికి ఒక బలమైన పునాదిగా నిలవనుంది. ఆర్టెమిస్-2 మిషన్ కోసం నాసా తన అత్యంత శక్తివంతమైన 'స్పేస్ లాంచ్ సిస్టమ్' (ఎస్ఎల్ఎస్) రాకెట్‌ను ఉపయోగిస్తోంది. సుమారు 322 అడుగుల ఎత్తుతో, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ కంటే భారీగా ఉండే ఈ రాకెట్, 8.8 మిలియన్ పౌండ్ల థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తూ 'ఓరియన్' వ్యోమనౌకను అంతరిక్షంలోకి తీసుకెళ్తుంది. జనవరి 17నే ఈ భారీ రాకెట్‌ను కెన్నడీ స్పేస్ సెంటర్ లాంచ్ ప్యాడ్‌కు తరలించనున్నారు. ప్రయోగానికి ముందు 'వెట్ డ్రెస్ రిహార్సల్' పేరుతో రాకెట్‌లో ఇంధనాన్ని నింపి పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మిషన్‌లో పాల్గొంటున్న నలుగురు వ్యోమగాముల ఎంపికలో నాసా ఎన్నో రికార్డులను సృష్టించింది. కమాండర్ రీడ్ వైస్‌మాన్ నాయకత్వంలో సాగే ఈ బృందంలో విక్టర్ గ్లోవర్ పైలట్‌గా వ్యవహరించనున్నారు, తద్వారా చంద్రుడి కక్ష్యలోకి వెళ్లే మొదటి నల్లజాతీయుడిగా ఆయన రికార్డు సృష్టించబోతున్నారు. అలాగే మిషన్ స్పెషలిస్ట్‌గా వెళ్తున్న క్రిస్టినా కోచ్ చందమామ చెంతకు వెళ్లే మొదటి మహిళగా చరిత్రకెక్కనున్నారు. వీరికి తోడుగా కెనడియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన జెరెమీ హాన్సెన్ కూడా ఈ చారిత్రాత్మక యాత్రలో భాగస్వామి కాబోతున్నారు. ఈ నలుగురు వ్యోమగాములు సుమారు 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి, అక్కడ ఓరియన్ నౌకలోని జీవ పరిరక్షణ వ్యవస్థలను (లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్) పరీక్షించి, క్షేమంగా భూమికి తిరిగి వస్తారు. ఆర్టెమిస్-2 విజయం సాధిస్తే, తర్వాతి దశలో 'ఆర్టెమిస్-3' ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై మనిషిని దించడానికి నాసా మార్గం సుగమం అవుతుంది. ముఖ్యంగా ఈ మిషన్ ద్వారా అంతరిక్షంలో రేడియేషన్ ప్రభావం, కమ్యూనికేషన్ వ్యవస్థల పనితీరును లోతుగా విశ్లేషించనున్నారు. ఈ ప్రయోగం కేవలం అమెరికా విజయం మాత్రమే కాకుండా, మానవజాతి మొత్తం గర్వించదగ్గ ఘట్టంగా అంతరిక్ష నిపుణులు అభివర్ణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతరిక్ష ప్రియులందరూ ఇప్పుడు ఫిబ్రవరి 6వ తేదీ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారూ,,



**తెలంగాణలో 4 రోజులపాటు**

## పాఠశాలలకు సెలవులు?

నవతరం ఖమ్మం భద్రాద్రి జిల్లా : తెలంగాణలో సంక్రాంతి సెలవులు ముగిశాయి. అయితే ఈ నెల చివరిలో తెలంగాణలో మరో 4 రోజులు విద్యార్థులకు సెలవులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మేడారం జాతర జనవరి 28 – 31 వరకు అత్యంత వైభవంగా జరుగనుంది. సమ్మక్కసారలమ్మ దేవతలను రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి ప్రజలు దర్శించుకుంటారు. ఈ జాతర సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని పీఆర్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదే జరిగితే విద్యార్థులకు వరుస సెలవులు రానున్నాయి. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

## లబ్ధిదారుని ఇంటికెళ్ళి చెక్కును అందించిన పిప్పల్ కోటి సర్పంచ్ దాసరి రమేష్



బోథ్, నవతరం: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారుని ఇంటికెళ్ళి అందించారు పిప్పల్ కోటి సర్పంచ్ దాసరి రమేష్. నేడు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సహకారంతో భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామానికి చెందిన బోన్ల రమేష్ కు మంజూరైన రూ. 60,000/- విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును వారి ఇంటికి వెళ్ళి అందించారు పిప్పల్ కోటి సర్పంచ్ దాసరి రమేష్.



## సైబరాబాద్ అడ్మిన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన టి. అన్నపూర్ణ, ఐపీఎస్

సైబరాబాద్, నవతరం: సైబరాబాద్ అడ్మిన్ డిసిపిగా టి. అన్నపూర్ణ, ఐపీఎస్. బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సైబరాబాద్ సీపీ ఎం. రమేష్, ఐపీఎస్.,ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2007 లో డైరెక్ట్ డీఎస్పీగా ఎంపికైన అన్నపూర్ణ, 2013లో కన్ఫర్డ్ ఐపీఎస్ అయ్యారు. ఇంతకుముందు ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా, ఇన్‌చార్జ్ డీఐజీగా సేవలందించారు. వికారాబాద్ ఎస్పీగా, కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా, పీటీసీ వరంగల్‌లో, మంగళగిరిగుంటూరు డీఎస్పీగా, చిత్తూరు అడిషనల్ డీసీపీగా విధులు నిర్వర్తించారు.

# ప్రజాసమస్యల పరిష్కారంగా అభివృద్ధే లక్ష్యం

## దత్తాత్రయ కాలనీ ప్రజా సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



కూకట్పల్లి, నవతరం: 124 అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రయ కాలనీ లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి మరియు చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా కాలనీలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాలను కాలనీ వాసులు కార్పొరేటర్ కు అందించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దత్తాత్రయ కాలనీలో దాదాపు తొంబై శాతం అభివృద్ధి పనులు పూర్తైనట్లు కాలనీ వాసులే చెప్పడం సంతోషంచదగ్గ విషయం అని అన్నారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని, కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్లు, డ్రైనేజీ, త్రాగు నీరు, వీధి దీపాలు, పారిశుద్యం వంటి పెండింగ్ ఉన్న సమస్యలను శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. అదేవిధంగా కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని, కాలనీ వాసులందరి సమిష్టి కృషి తో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ తెలియచేసారు. కాలనీలోని ఒక గల్లీలో మంజీరా నీటీలో డ్రైనేజీ నీరు కలిసి త్రాగునీరు కలుషితం అవ్వుతుందని కాలనీ మహిళలు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకురగా కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యను త్వరలో పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, గోపాల్, జగదీష్, సత్యనారాయణ, వెంకటేష్ గౌడ్, వీరేషం, అశోక్, నాగభూషణం, కృపాకర్ గౌడ్, లింగం, సత్తయ్య, ఎమ్.డి మోసిన్, హరి, శ్రీకాంత్, లక్ష్మణ్ రావు, రామకృష్ణ, యాదగిరి. జి.ఎచ్.ఎమ్.సి అధికారులు వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సూపర్వైజర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ రామచంద్రరావు సెక్స్ వీడియో వైరల్

## హోంమంత్రి ఆగ్రహం, నివేదిక కోరిన సీఎం



నవతరం, బెంగుళూరు : కర్ణాటక రాష్ట్ర సీనియర్ పోలీస్ అధికారి డీజీపీ రామచంద్రరావు ప్రభుత్వ కార్యాలయంలో కొందరు మహిళతో ముద్దు పెట్టుకున్న వీడియో వైరల్ అయింది. ఈ వీడియో బయటకు వచ్చినప్పటి నుండి కర్ణాటక పోలీస్ శాఖ దిగ్భ్రాంతికి గురైంది. అలాంటి అధికారులను ఆ శాఖపై నల్ల మచ్చగా అభివర్ణిస్తున్నారు. ఇంతలో, హోంమంత్రి పరమేశ్వర్ డిజిపిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు మరియు సాయంత్రం నాటికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివేదిక కోరారు. ప్రస్తుతం డీసీఆర్ఈగా పనిచేస్తున్న రామచంద్రరావు కార్యాలయంలో ఉన్నప్పుడు తన డిపార్ట్మెంట్ యూనిఫాంలో ఉన్న ఒక మహిళను ముద్దు పెట్టుకున్నాడు. సూట్లో ఉన్న ఒక మహిళతో కలిసి ఉన్న వీడియోలతో సహా వివిధ వీడియోలు ప్రచారంలో ఉన్నాయి. ప్రత్యేకత ఏమిటంటే అక్రమ బంగారు స్మగ్లింగ్లో పాల్గొన్న నటి రన్యా రావు కుమార్తె. రన్యా రావు కేసు వెలుగులోకి రాకముందే డీజీఏపీ సెక్స్ వీడియోలు ఉన్నాయని తెలిసింది. డీజీపీ రామచంద్రరావు కార్యాలయంలో పోలీసు యూనిఫాంలో కూర్చుని ఒక మహిళను ముద్దు పెట్టుకుంటున్నట్లు, ఆ మహిళ టాయిలెట్లో హస్తప్రయోగం చేస్తున్నట్లు వీడియోలో ఉంది. ఈ విషయం ఇప్పుడు వెలుగులోకి రావడంతో రాష్ట్ర హోంమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర కలత చెందినట్లు చెబుతున్నారు. అందుకే ఆయన తన కార్యాలయానికి వచ్చిన రామచంద్రరావును కలవడానికి నిరాకరించారు.

### నేడు రామచంద్రరావు సస్పెండ్ చేసే అవకాశం ఉంది

ప్రభుత్వ కార్యాలయంలో సీనియర్ పోలీసు అధికారి లైంగిక దుష్ప్రవర్తన కేసు వెలుగులోకి రావడంతో సిద్ధరామయ్య చర్య తీసుకున్నారు. వైరల్ వీడియో కేసుకు సంబంధించి హోం శాఖ నుండి నివేదిక కోరాడు. నివేదికను పరిశీలించిన తర్వాత ఈ సాయంత్రం నాటికి చర్య తీసుకుంటానని సిద్ధరామయ్య చెప్పారు. మరోవైపు, రామచంద్రరావు ఈ కేసుకు సంబంధించి తన మొదటి స్పందనను ఇచ్చారు, ఇది తనపై జరిగిన కుట్ర అని, దాని గురించి తనకు తెలియదని అన్నారు. ఇవన్నీ చూస్తుంటే, ఈరోజే రామచంద్రరావు సస్పెండ్ చేసే అవకాశం ఉంది అని చెబుతున్నారు.

### రామచంద్రరావు మొదటి ప్రతిచర్య

డిజిపి రామచంద్రరావు హోంమంత్రి జి. పరమేశ్వరను కలవడానికి వచ్చారు. మంత్రి నిరాకరించారు. ఆ సమయంలో బయట మీడియాకు స్పందిస్తూ, రామచంద్రరావు ఇది ఒక సంవత్సరం క్రితం జరిగినట్లుగా స్పందించారు. ఆయన బెల్గాంలో సర్వీస్లో ఉన్నప్పుడు ఈ విషయాన్ని ప్రస్తావించారు. తరువాత, ఇదంతా ఒక కుట్ర. ఈ వీడియో గురించి తనకు తెలియదని ఆయన అన్నారు. డీజీపీ రామచంద్రరావు రసలీల వీడియో కేసు రాష్ట్ర ప్రభుత్వానికి చాలా ఇబ్బంది కలిగించింది. డ్రగ్స్ మరియు నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై కొంతమంది అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఇప్పుడు, ఒక ప్రభుత్వ కార్యాలయంలో ఒక సీనియర్ అధికారి ఇలా చేయడం ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించింది.

### డీజీపీ ఏమన్నారు అంటే

ఈ ఘటనపై తొలిసారి ఆయన మీడియాతో మాట్లాడారు.'ఇది నాకు షాకింగ్ గా ఉంది. వీడియో ఫ్యాబ్రికేటెడ్. కాగా దీనిపై ఆయన హోం మంత్రిని కలిసి ఎందుకు ప్రయత్నించగా అపాయింట్మెంట్ ఇవ్వలేదని తెలుస్తోంది. అటు ఘటనపై పూర్తి దర్యాప్తు జరుగుతామని చట్టానికి ఎవరు అతీతులు కాదని సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు.

# 6 .12 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా కంచె

## నల్లమల్లారెడ్డి ఆక్రమణలపై హైడ్రా చర్యలు







హైదరాబాద్, నవతరం: సరిగ్గా ఏడాది క్రితం దివ్యా నగర్ లే ఔట్లో అడ్డుగోడలను తొలగించిన హైడ్రా మళ్లీ అక్కడే ప్రభుత్వ స్థలాన్నిసోమవారం కాపాడింది. నాడూ.. నేడూ హైడ్రా ఆపరేషన్కు చిక్కింది విద్యాసంస్థల అధినేత నల్లమల్లారెడ్డే కావడం గమనార్హం. ప్రభుత్వ భూమిలో అనుమతి లేని లే ఔట్తో ప్లాటింగ్ చేసి నల్లమల్లారెడ్డి మళ్లీ హైడ్రాకు చిక్కాడు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లుగా అమ్మేయడాన్ని సీరియస్ గా హైడ్రా పరిగణించింది. 6.12 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా సోమవారం కాపాడింది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మడలం కాచవాణి సింగారం గ్రామం సర్వే నంబరు 66/2, 3, 4, 5లలో 6.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనికి ఆనుకుని లే ఔట్ వేసిన నల్లమల్లారెడ్డి.. ప్రభుత్వ భూమిలోకి కూడా చొరబడి కొన్నిటిని ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నారు. మొత్తం 6.12 ఎకరాల ప్రభుత్వ భూమిని తన ఆధీనంలో ఉంచుకున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందడంతో క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా పరిశీలించింది. సర్వే ల్యాండ్ రికార్డుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఇందులో దాదాపు 50 వరకూ నల్లమల్లారెడ్డి వేసిన ప్లాట్లు కూడా ఉన్నాయి. ఇలా అక్కడ 6.12 ఎకరాల మేర ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురి కాకుండా హైడ్రా కాపాడింది. ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విక్రయించడమే కాకుండా.. తమకు నోటీసులు ఇవ్వకుండా ఎలా కంచె వేస్తారని నల్లమల్లారెడ్డి చేసిన అడ్డుకునే ప్రయత్నాలు ఫలించలేదు. చుట్టూ ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

# సైబరాబాద్ పోలీసుల మానవీయ కోణం



హైదరాబాద్, నవతరం: ఇంట్లో నుంచి బయటకు వచ్చి దారి తప్పి పోయి, దీనస్థితిలో రోడ్డుపై భిక్షమెత్తుతూ ఇబ్బందులు పడుతున్న ఊరడి లీలమ్మ (74) అనే వృద్ధురాలిని కేపీహెచ్బీ పోలీసులు గుర్తించారు. మానవీయతతో స్పందించిన పోలీసులు ముందుగా ఆమెను సమీప వృద్ధాశ్రమంలో చేర్పించి భద్రత, సంరక్షణ కల్పించారు. అనంతరం ఆమె వివరాల ఆధారంగా రక్తసంబంధీకుల కోసం విచారణ చేపట్టి, దీనబంధు కాలనీలో నివసిస్తున్న ఆమె చిన్న కూతురు ప్రమీలను గుర్తించారు. అవసరమైన ధృవీకరణ అనంతరం ఈరోజు లీలమ్మను ఆమె కూతురికి క్షేమంగా అప్పగించారు. వృద్ధురాలిని కుటుంబానికి చేర్చిన పోలీసుల మానవీయ చర్యపై స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

# బస్సులో అసభ్య ప్రవర్తన ఆరోపణలుడ వైరల్ వీడియో ::: అవమానం తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య



నవతరం బ్యూరో చీఫ్ : కేరళలో కలకలం రేపిన ఘటనలో, బస్సులో అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఓ యువతి తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీపక్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో దీపక్ తనను అనుచితంగా తాకాడని ఆరోపిస్తూ యువతి వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో వేగంగా వైరల్ కావడంతో, దీపక్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. తాను అలాంటి వ్యక్తి కాదని, తనపై వచ్చిన నిందారోపణలు తట్టుకోలేకపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పిన అనంతరం, తీవ్ర అవమాన భారంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సోషల్ మీడియాలో నిర్ధారణ లేకుండా ఆరోపణల వీడియోలు పోస్ట్ చేయడం వల్ల కలిగే పరిణామాలపై చర్చ మొదలైంది.




# తిరుమలలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

## ఈ నెల 25న రథసప్తమి

### సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలు

### ఏడు వేర్వేరు వాహనాలపై విహరించనున్న వేంకటేశ్వర స్వామి

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది. ఒక్కరోజులోనే స్వామివారి ఏడు వాహన సేవలను దర్శించుకునే అరుదైన అవకాశం లభించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తిరుమలకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్శన క్యూలైన్లను సక్రమంగా నిర్వహించడం, తాగునీటి సరఫరా, అన్నప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రథసప్తమి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో 137 'రాజీవ్ స్వగృహ' ప్లాట్ల వేలం

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లాలోని తొర్రూర్ (105 ప్లాట్లు), కుర్మల్‌గూడ (20 ప్లాట్లు), మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో (12 ప్లాట్లు) గల మొత్తం 137 ప్లాట్లను వేలం వేయనున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో వేలం ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువగా, చదరపు గజానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్య ధరలను నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల కొనుగోలుదారులు మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగమే ఈ ప్లాట్లను అభివృద్ధి చేయడం వల్ల కొనుగోలుకు మంచి డిమాండ్ ఉంటుందని ఆయన అన్నారు. ఈ వేలం ప్రక్రియ మరియు ప్లాట్ల వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను (https://www.swagruha.telangana.gov.in/ais/) సందర్శించవచ్చని ఆయన తెలిపారు.

# అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి

## హైడ్రా ప్రజావాణిలో అమీన్‌పూర్ నివాసితుల వినతి






హైదరాబాద్, నవతరం: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ధారించాలని పలువురు హైడ్రాను కోరారు. ప్రతి ఏటా అమీన్‌పూర్ చెరువులో నీటి నిలువల స్థాయి పెరుగుతుండడంతో తమ ఇళ్లతో పాటు.. ప్లాట్లు నీట మునుగుతున్నాయని వాపోయారు. ఎఫ్‌టీఎల్, బఫర్ హద్దులను నిర్ధారించి తమకు న్యాయం చేయాలని పలువురు కోరారు. సోమవారం నాటి ప్రజావాణికి పెద్దయెత్తున హాజరై వినతిపత్రాలు అందజేశారు. చెరువును ప్రభుత్వం అభివృద్ధి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో అందులో ప్లాట్లు, ఇళ్లు కోల్పోయినవారిని కాపాడాలని కోరారు. మరో దారి లేని పక్షంలో ప్రత్యామ్నాయంగా స్థలాలు చూపించాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా పెద్దంబర్‌పేట విలేజ్‌లోని శబరిహిల్స్ లే ఔట్‌లో రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురౌతున్నాయని అక్కడి స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 43 ఫిర్యాదులందాయి. ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

**ఫిర్యాదులు ఇలా..**

- రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, చందానగర్ లోని సిటిజెన్స్ కాలనీ పార్కు ఆక్రమణకు గురి అవుతోందని స్థానికులు ఫిర్యాధు చేసారు. హుడా అనుమతి పొందిన లేఔట్ లోని పార్కును ఆక్రమించేసి.. చెత్త డంపింగ్ కేంద్రంగా అక్కడి వ్యాపారి వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. అలాగే రహదారులను కూడా ఆక్రమించి టెంపరరీ షెడ్డులు వేసి వ్యాపారాలు చేసుకుంటున్నారని సిటిజెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు.
- రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం, హైదరగూడలోని సంజీవనీ హిల్స్ పార్క్ ఆక్రమణకు గురవుతోందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. పార్క్ బౌండరీ వాల్‌ను అక్రమంగా ధ్వంసం చేసి, సొసైటీ భవనం నిర్మిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల పరిసర ప్రాంతంలో హరిత స్థలాలు గణనీయంగా తగ్గిపోయినట్టయ్యిందన్నారు. ఈ పార్క్‌ను కాపాడి నివాసితులకు ప్రాణవాయువును అందించాలని హైడ్రాకు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.
- ఎల్.బి.నగర్ సమీపంలోని ప్రాంతంలో ఉన్న బైరామల్గూడ చెరువు సుమారు 6.30 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు అభివృద్ధి కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ గత 5 సంవత్సరాలుగా ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు. దీని కారణంగా డ్రైనేజ్ నీరు నేరుగా చెరువులోకి చేరుతోంది. దీంతో తీవ్ర కాలుష్యానికి గురవుతూ, పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని స్థానికులు హైడ్రా ప్రజావాణి లో వాపోయారు. హైడ్రా జోక్యం చేసుకుని చెరువును అభివృద్ధిచేయాలని కాకతీయ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రజావాణి ఫిర్యాదులో కోరారు.

# అన్నదాతపై 'వ్యాపార' వేట..

**అశ్వారావుపేటలో అప్పుల సాకుతో రైతుల గొంతు నొక్కుతున్న దళారులు!.. అన్నదాతకు పెట్టుబడి సంకెళ్లు**

**వ్యాపార గుప్పెట్లో బందీగా రైతు బతుకు .. వ్యాపారుల చేతుల్లో నిలువ దోపిడి**

**పెట్టుబడి సాగుతో పచ్చని పంటకు నిప్పు .. నోరు మెదపలేని స్థితిలో అన్నదాత**

**తేమ,తరుగు పేరుతో మోసం .. రహస్య గోదాముల్లో అక్రమ నిల్వలు**

**వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి ధాన్యం,పత్తి కొనుగోలు కేంద్రాలను ముమ్మరంగా తనిఖీ చేయాలి**





**నవతరం ఖమ్మం భద్రాద్రి జిల్లా**

రుతువు మారినా రైతు రాత మారడం లేదు. నేలమ్మను నమ్ముకుని చమటను చిందించిన రైతుకు చివరకు మిగిలేది కన్నీళ్లేనా? అటు ధాన్యం కొనుగోలు లోను ఇటు పత్తి మార్కెట్లోనూ దళారులు వ్యాపారులు ఏకమై రైతును నిలువునా ముంచుతున్నారు. సాగు కోసం పెట్టుబడి ఇచ్చిన చేతులే ఇప్పుడు అదే సాకుతో రైతుల గొంతు కోస్తుంటే అటు అధికారులు కానీ ఇటు ప్రజా సంఘాలు కానీ పట్టించుకోకపోవడం శోచనయం. పెట్టుబడి ఇచ్చి ప్రాణం తీస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే అశ్వారావుపేట మండలంలో దళారుల దోపిడీ పరాకాష్టకు చేరింది. అప్పులిచ్చిన సాకుతో రైతులను బందీలుగా మార్చుకుని, తూకాల్లో తేడాలు, ధరలో కోతలతో వ్యాపారులు అక్రమాలకు తెరలేపుతున్నారు. తమ కళ్లముందే అన్యాయం జరుగుతున్నా, రేపు పెట్టుబడికి అప్పు పుట్టదేమో అన్న భయంతో రైతులు కన్నీళ్లను గుండెల్లోనే దాచుకుంటున్నారు. సీజన్ ఆరంభంలో సాగు ఖర్చులకోసం రైతులు గత్యంతరం లేక స్థానిక వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు పంట చేతికి వచ్చాక తమకే తక్కువ ధరకు అమ్మాలని షరతులు విధిస్తున్నారు. ధాన్యం రైతుల గోస మద్దతు ధర ఊసే లేదు. తూకంలో మోసాలు. తేమశాతం పేరుతో కోతలు విధిస్తూ రైతులను నష్టపరుస్తున్నారు.

**వ్యాపారులదే ఆధిపత్యం**

బయట మార్కెట్ ధర కంటే తక్కువకు అడుగుతున్నా తీసుకున్న అప్పు తీర్చాలి కాబట్టి రైతు నోరు మెదపలేక మౌనంగా దగా పడుతున్నాడు. ప్రభుత్వ అధికారులు నిద్రపోతున్నారా? ప్రభుత్వ నిబంధనలు కాగితాలికే పరిమితం అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఏ వ్యాపారి ఎంత ధరకు కొంటున్నాడు? రైతుకు సరైన ధర అందుతుందా? లేదా? అని పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకు పరిమితమయ్యారు. వ్యాపారుల దోపిడీపర్వం కళ్ళముందే జరుగుతున్నా మాకేం పట్టనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**అప్పులే సంకెళ్లుగా**

పంట పెట్టుబడి కోసం రైతులు ముందుగానే వ్యాపారుల దగ్గర అప్పులు తీసుకుంటున్నారు. దీన్నే అదనుగా తీసుకుంటున్న కొందరు వ్యాపారులు, ధాన్యం కొనుగోలు సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొలతల్లో మోసాలు చేస్తున్నా, అదనపు తరుగు తీస్తున్నా ప్రశ్నించలేని స్థితిలో రైతులు ఉన్నారు. "నోరు తెరిస్తే అప్పు తీర్చమని వేధిస్తారు.. లేదంటే వచ్చే ఏడాది పెట్టుబడి ఇవ్వరు" అనే భయం వారిని మౌనంగా ఉంచుతోంది.

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

మార్కెటింగ్ శాఖ, సివిల్ సప్లై అధికారుల తనిఖీలు అశ్వారావుపేట మండలంలో నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు వచ్చి



నిష్పక్షపాతంగా కొలతలు వేయాల్సిన అవసరం ఉంది. రైతులు భయపడకుండా ఫిర్యాదు చేసేలా ప్రభుత్వం భరోసా కల్పించాలని, అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**దళారుల దోపిడీకి అడ్డుకట్టపడేది ఎప్పుడు? మద్దతు ధర కాగితాలికే పరిమితమా?**

క్షేత్రస్థాయిలో సాగుతున్న సిండికేట్ దందా అటు ధాన్యం ఇటు పత్తి రెండింటిలోనూ రైతన్నకు దిక్కెవరు? ధాన్యం సిండికేట్, పత్తి దళారీలు ఒకటైన శక్తులు. చిక్కుకున్న సామాన్య రైతు.

**ప్రజా ప్రతినిధులు స్పందించాలి:**

రైతుల నిస్సహాయతను పెట్టుబడిగా మార్చుకుంటున్న ఈ 'మాఫియా'పై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. అశ్వారావుపేట పరిధిలోని కొనుగోలు కేంద్రాలు మరియు ప్రైవేట్ వ్యాపారుల గోడౌన్ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రైతుకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. కష్టాల్లో ఉన్న రైతుకు వెన్నుదన్నుగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

**డిమాండ్**

వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి ధాన్యం,పత్తి కొనుగోలు కేంద్రాలను ముమ్మరంగా తనిఖీ చేయాలి. వ్యాపారుల వద్ద బందీ అయిన రైతును విముక్తుడిని చేసి ప్రతి గింజకు మద్దతు ధర దక్కేలా చూడాలి.లేని పక్షంలో అన్నదాతల ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.




# రూ.500 కంటే తక్కువ.. 72 రోజుల వ్యాలిడిటీ

భారతదేశంలో టెలికాం రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్-ఐడియా, బీఎస్ఎన్ఎల్ కంపెనీలు తమ అగ్రస్థానాలను దక్కించుకోవడానికి వివిధ ప్రీపెయిడ్ పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లను ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికామ్ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు తాజాగా 72 రోజుల ప్లాన్ తీసుకొచ్చింది. పోర్ట్‌ఫోలియోలో అత్యుత్తమ ప్రీపెయిడ్ ప్లాన్‌లలో ఒకటి రూ. 500 కంటే తక్కువ ధరకే లభిస్తుంది. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని సంస్థ తెలిపింది.

**రూ.485 ప్రీపెయిడ్ ప్లాన్**

బీఎస్ఎన్ఎల్ పరిచయం చేసిన ఈ రూ.485 ప్రీపెయిడ్ ప్లాన్ ద్వారా.. యూజర్ అపరిమిత కాల్స్, రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్/రోజుకు లభిస్తాయి. ఈ ప్యాక్ వ్యాలిడిటీ 72 రోజులు మాత్రమే.

**ఇప్పటికే రూ.251 రీఛార్జ్ ప్లాన్**

బీఎస్ఎన్ఎల్ స్టూడెంట్ ప్లాన్ పేరుతో పరిచయం చేసిన ఈ రీఛార్జ్ ప్లాన్ ధర రూ. 251 మాత్రమే. వ్యాలిడిటీ 28 రోజులు. అంటే రోజుకు 8.96 రూపాయలన్నమాట. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. ఉచిత కాలింగ్, డేటా, ఎస్ఎంఎస్ ప్రయోజనాలు లభిస్తాయి. ఈ ప్లాన్ పరిమిత కాలం మాత్రమే (నవంబర్ 14 నుంచి డిసెంబర్ 14 వరకు) అందుబాటులో ఉంటుంది.28 రోజులు అపరిమిత కాల్స్ మాత్రమే కాకుండా 100జీబీ హైస్పీడ్ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. ఇది బీఎస్ఎన్ఎల్ కస్టమర్లందరికీ అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకోవాలనుకునే కస్టమర్లు.. బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను సందరించడం ద్వారా, అధికారిక వెబ్‌సైట్ ద్వారా రీఛార్జ్ చేసుకోవచ్చు.

# ఈ-స్కూటర్లకు హోండా గుడ్‌బై!



న్యూఢిల్లీ:యాక్టివా ఎలక్ట్రిక్ స్కూటర్‌కు హోండా గుడ్‌బై పలుకబోతున్నదా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఎంతో ఆర్భాటంగా దేశీయ మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసిన జపాన్ వాహన సంస్థ హోండా..ఈ స్కూటర్‌కు డిమాండ్ బాగానే ఉన్నప్పటికీ గడిచిన నాలుగు నెలలుగా ఉత్పత్తిని నిలిపివేసినట్టు తెలుస్తున్నది. దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం బట్టబయలు అయింది.ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు ఉత్పత్తిని నిలిపివేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు ఆరు నెలలపాటు 11,168 యూనిట్ల ఎలక్ట్రిక్ యాక్టివా ఈ, క్యూసీఐ మాడళ్లను ఉత్పత్తి చేసింది. వీటిలో సగం 5,201 యూనిట్లను డీలర్లకు డెలివరీ చేసింది. విక్రయాలు ఆ స్థాయిలో లేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసినట్టు తెలుస్తున్నది. ఈ 5,201 యూనిట్లలో 4,461 యూనిట్లు క్యూసీఐ మాడల్ కాగా, మిగతా 740 యాక్టివా ఈ మాడల్ మాత్రమే.తన బ్రాండ్ నుంచి తొలి ఈ-స్కూటర్ ఇదే కావడం విశేషం. ప్రస్తుతం హోండా యాక్టివా ఈ స్కూటర్ ధర రూ.1.17 లక్షలు కాగా, క్యూసీ1 మాడల్ ధర రూ.90,022గా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌లో 102 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఈ స్కూటర్ల ధరల్లో ఇదే తక్కువ అయినప్పటికీ కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం విశేషం. ప్రస్తుతం మార్కెట్లో హోండా స్కూటర్లతోపాటు బజాజ్, టీవీఎస్, ఏథర్, ఓలా, హీరో మోటోకార్ప్‌లు పలు మాడళ్లను విక్రయిస్తున్నాయి.




# వ్యవస్థీకృత లీకేజీలతో బీమాకు దెబ్బ

మోసం, వృథా, పాలసీ ఉల్లంఘనలు తదితర వ్యవస్థీకృత లీకేజీలతో దేశీయ బీమా రంగం ఏటా రూ.10,000 కోట్ల మేర నష్టపోతున్నదని ఓ తాజా రిపోర్టు వెల్లడించింది. దీంతో బీమా రంగంలో విశ్వసనీయత నిశ్శబ్దంగా అంతరించిపోతున్నదని సదరు నివేదిక పేర్కొన్నది.బీమా సంస్థలు, కార్పొరేట్లు, ప్రభుత్వం, రెగ్యులేటర్లు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని తెలిపింది.

# అభినవ వాల్మీకి త్యాగరాజు

**"మరుగేలారా? ఓ రాగవా! ॥మరుగేలారా॥**

**మారుగేలా? చరాచర రూప! పారా -**

**త్పరా! సూర్య సుధాకర లోచన ! ॥మరుగేలారా॥**

**అన్నీ నీవనుచు నమ్తరంగమున**

**దిన్నగ వెదకి - తెలుసుకొం తినయ్యా;**

**నిన్నేగాని మదిని నెన్నజాల నోరులా,**

**నన్ను బ్రోవయ్యా, త్యాగరాజనుతా! ॥మరుగేలారా॥"**

శ్రీరాముని గూర్చి త్యాగరాజు "నన్ను బ్రోవవా" అంటూ రచించి పాడిన కీర్తన.ఆయన కీర్తనలు సంగీతసాహిత్య సమ్మిళితమైన భక్తిభావనలను వెదజల్లుతాయి. అభినవ వాల్మీకిగా త్యాగరాజును కీర్తిస్తారు.వాల్మీకీ మహర్షి రామాయణాన్ని 24 వేల శ్లోకాలతో రచించాడు. త్యాగరాజు శ్రీరామ భక్తుడు.ఆయన శ్రీరామునిపై 24 వేల కీర్తనలు రాసి రాముని కే అర్పించడం తో ఆయనను వాల్మీకీ అవతారంగా భావిస్తారు.ఆయన కీర్తనలు శిష్యులు తాళపత్రాలపై భద్రపరిచారు.త్యాగరాజు నాదోపాసన ద్వారా భగవంతుని దర్శించవచ్చని నిరూపించిన వాగ్గేయ కారుడు. త్యాగరాజు అచ్చతెలుగు వారు.కర్ణాటక సంగీత త్రీమూర్తులలో త్యాగరాజు ఒకరు.మరో ఇద్దరు శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు.వీరుముగ్గురూ తమిళనాడులోనూ తంజావూరుజిల్లా తిరువారూరుకు చెందిన వారు కావడం విశేషం. వారు తమిళ దేశంలోపుట్టినా వారి గానం ఎక్కువగా తెలుగు, సంస్కృతాల్లోనే సాగింది.ఆయన కీర్తనలలో అధికభాగం తెలుగులోనే ఉండడం గమనార్హం.కొన్ని సంస్కృతంలో కూడా రాసారు.రాజుల ప్రాపకాన్ని ఆయన ఏనాడు ఆశించలేదు.వారి ప్రలోభాలకు లొంగలేదు.తన రామ భక్తిని అడ్డుకోవద్దని వారిని కోరుతూ ఆయన మనసులోంచి కీర్తనే వచ్చింది.

1767 మే 4 నా తమిళనాడులోని తిరువారూరులో కాకర్ల రామబ్రహ్మం సీతమ్మ దంపతులకు జన్మించారు.త్యాగరాజు అసలు పేరు కాకర్ల త్యాగ బ్రహ్మం.వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కాకర్ల గ్రామానికి చెందినవారు.విజయనగర సామ్రాజ్యం పతనం తరువాత వారు తమిళనాడు వలస వెళ్ళారు.చిన్నతనంలోనే ఆయన సంగీత గురువు శొంఠి వెంకటరమణయ్య. చిన్నవయసులోనే సంస్కృతం,తెలుగు,భాగవతం,రామాయణంలో ప్రావీణ్యం సంపాదించారు.తండ్రితో తరుచూ తంజావూరు రాజ్యసభకు వెళ్లేవారు.త్యాగరాజు నారదమహర్షిని హీరోగా పూజించేవాడు.ఆయన కీర్తనలను త్యాగరాజ కృతులు గా భావిస్తారు.సంగీతాన్ని దైవత్వం అనుభవించడానికి మార్గంగా భావించాడు. ఒక సన్యాసి నారదుని ప్రార్థిస్తూ మంత్రాన్ని త్యాగరాజు కు ఉపదేశించాడు. తాను తొలి కృతి సంస్కృతంలో "నమో నమో రాఘవాయ" పేరుతో దేశీయ తోడి రాగంలో రచించి తన ఇంటి గోడలపై చెక్కారు.ఆయన కృతులు ప్రధానంగా భక్తి,తాత్విక భావన కూడి ఉంటాయి.తనకృతుల సాహిత్యం ద్వారా ప్రజలకు సందేశం ఇచ్చారు. ఆయన తన కృతులలో నిందాస్తుతిని (దైవాన్ని తిట్టడం)కూడా ప్రవేశం పెట్టారు.రామదాసు కీర్తనలలో బాగా కనిపిస్తుంది.త్యాగరాజకృతులను పంచరత్నాలంటారు.అవి అది తాళానికి అనుసంధానించారు. ఆయన రచించినది 24 వేల కీర్తనలు ఐనా లభ్యమయ్యేవి కేవలం 720మాత్రమే.ఇవేకాక ఆయన తెలుగులో రెండు సంగీత నాటకాలు, ప్లహలాదభక్తి విజయం,నౌకా చరితం రచించారు.ఆయన సమకాలికులు గతసంగీతాన్ని అందిస్తే, త్యాగరాజు కొత్త సంగీత భావనలను ప్రేక్షకులకు పరిచయం చేసాడు.త్యాగరాజు శిష్యులు ఆయన రచనల క్రోడీకరణ ఏకీకృతం గా చేయలేదు.తత్ఫలితంగా ఆయన రచనలు చేతులు మారుతునే ఉన్నాయి.తొలి సంకలనం చిన్నస్వామి ముదిలియార్ 1893లో "ఓరియంటల్ మ్యూజిక్ ఇన్ యూరోపియన్ నోటేషన్" అనే సంపుటిని ప్రచురించారు.మరో సంగీత పండితుడు పార్ధ సారధి త్యాగరాజు శిష్యుల కుటుంబాలు వద్ద ఉన్న అసలు రాత ప్రతులను పరిశీలించి కృతులను అర్ధాలతో గ్రంథాన్ని ప్రచురించారు.ఇప్పటికీ తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో భద్రపరిచారు. ఆయన కృతులను తెలుగు లిపిలో సంకలనం చేయడమే కాక టీటీడీ దేవస్థానం ఏడు సంపుటాలుగా ప్రచురించారు.

త్యాగరాజు తండ్రి మరణానంతరం ఆయన వాటాగా శ్రీరామలక్ష్మణ విగ్రహాలు వచ్చాయి.వాటిని భక్తితో పూజించేవాడు.18 ఏళ్ల వయస్సులో పార్వతి అనే యువతితో వివాహమైంది.అయన 23 ఏళ్ల వయస్సులో భార్య మరణించింది.తరువాత ఆమె సోదరి కమలాంబను వివాహమాడారు.వీరికి సీతామహాలక్ష్మి అనే కూతురు జన్మించింది.ఆమెకు కుమారుడు జన్మించి యవ్వనంలోకి రాకముందే చనిపోయాడు.దాంతో త్యాగరాజు కు ఖచ్చితమైన వారసులు లేరు.

త్యాగరాజు జీవితంలో ఎన్నడూ ఉద్యోగం చేయలేదు. ఒకరి దగ్గరకు వెళ్ళి చేయి చాపలేదు. తెల్లవారి లేస్తే సంధ్యావందనం చేసుకోవడం, కావేరీ నది ఒడ్డుకు వెళ్ళడం, అక్కడి నుంచి వచ్చి భాగవత, రామాయణాలు, భగవద్గీతలు చదువు కోవడం. మధ్యాహ్నం తరువాత కీర్తనలు చేసుకుంటూ ఊంఛ వృత్తి చేసుకోవడం. అంటే..



తన వద్ద ఇంట్లో ఎంత మంది శిష్యులు సంగీతం నేర్చుకోవడానికి వచ్చారో వారి ఉదర పోషణకు సరిపడా పదార్థాల్ని సేకరించడానికి ఎన్ని ఇళ్ళ ముందుకు వెళ్ళి చేయి చాపవలసి వస్తే అన్ని ఇళ్ళ వద్దకు వెళ్ళి కీర్తనలు చేయడం. పెట్టిన వారూ ఒకటే, పెట్టని వారూ ఒకటే. పదార్థాలు సరిపడా సమకూరాయని అనిపించగానే తిరిగి వచ్చి భార్య కమల కు ఇవ్వగానే వాటిని వండి సిద్ధం చేసేది. దానిని త్యాగరాజు రామచంద్రమూర్తికి నివేదించి తాను, తన కుటుంబం, శిష్యులు స్వీకరించేవారు.

చెట్టును ఆశ్రయిస్తే గోత్ర నామాలు అడగకుండా నీడ ఎలా ఇస్తుందో అలా ఆయన పాదాలను ఆశ్రయించిన ప్రతి వారికీ సంగీత విద్యను నేర్పేవారు.

అలా జీవించిన త్యాగరాజుకి ఏం లోటు. ఎందరో మహా రాజులు ఎలాగయినా వారిని తమ సన్నిధానానికి తెచ్చుకోవడానికి విశ్వప్రయత్నాలు చేసారు. తంజావూరు మహారాజు అయితే మారు వేషాల్లో వచ్చి ఆయన కీర్తనలు విని ఆనందిస్తూండేవారు. ఒక రోజు ఆయన జోలెపట్టి వెడుతుంటే దానిలో బంగారు కాసులు వేసారు ఏం చేస్తారో చూద్దామని. బంగారు కాసులు పడడం చేత ఈవేళ ఈ ఆహారం తినడానికి అయోగ్యమయిందని త్యాగరాజు దానిని మొత్తం తీసుకెళ్ళి చెత్తకుప్పలో వేసారు.

ఆ సందర్భంగానే

**"నిధి చాల సుఖమా, రాముని సన్నిధి చాలా సుఖమా..."**

అని కీర్తన చేసారు. ఈయన పక్కింట్లోనే అన్నగారు జపేశుడు ఉండేవారు. ఎంత సేపటికీ ఈ విగ్రహాలు పెట్టుకుని మహారాజులు బహుమతులు ఇచ్చినా పుచ్చుకోనంటున్నాడని కోపమొచ్చి ఆ విగ్రహాలు పోతే తప్ప తమ్ముడికి బంగారం మీద మమకారం కలగదని ఎవరూ చూడకుండా వాటిని తీసుకెళ్ళి కావేరీ నదిలో పారేసాడు.

వాటి కోసం త్యాగయ్య రాత్రింబవళ్ళు పరితపించిపోయి...

**"నిన్ను ఎందని వెదకను హరీ..."**

అని కీర్తన చేసారు.

తన ఇష్టదైవం కలలో కనపడి కావేరీ నది దగ్గరకు రమ్మనమని ఆదేశిస్తే అక్కడ నీటిలో తేలియాడుతూ వచ్చాయి విగ్రహాలు.

పరమేశ్వరుడు ఉన్నాడనడానికి ప్రత్యక్ష నిదర్శనాలు వీరి జీవితాలు. ఆ విగ్రహాలు కావేరీ నది మీద తేలుతూ వస్తే...

**"సుకుమార రఘువీర రారా మా ఇంటికిడ"**

**అని ఆర్తితో కీర్తనను ఆలపిస్తూ తీసుకెళ్ళారు.**

త్యాగరాజు కుమార్తె వివాహం జరుగుతుంటే దక్షిణ భారతదేశం నుంచి ఒక స్నేహితుడు ఆయనకు రామచంద్రమూర్తి విగ్రహాలను తెచ్చి బహూకరించాడు. అది చూసి కన్నీటి పర్యంతమయిన త్యాగయ్య నాకోసం అంత దూరం నుంచి నడిచి వచ్చావా స్వామీ, నీ కాళ్ళెంత సొక్కిపోయాయో.. అంటూ–

**"నను పాలింపగ నడచి వచ్చితివా..." అని కీర్తించారు.అది త్యాగరాజు భక్తి.**

భూలోక నారదుని గా ప్రసిద్ధి చెందిన త్యాగరాజు "రామేతి మధురం వాదం" అనే లాగా 96 కోట్ల సార్లు రామనామం జపించి స్వీయానుభవాలే కృతులు గా రచించాడు.ఆయన కృతులు ద్వారా సంగీతం సాహిత్య రసజ్ఞుల హృదయాలను గెలిచారు.ప్రతి ఏడాది త్యాగరాజు ఆరాధనోత్సవాలలో పంచరత్న కీర్తనలు ఆలపించడం సాంప్రదాయంగా వస్తున్నది.తంజావూరులోని ఆయన సమాధిని ఆయన భక్తురాలు బెంగుళూరు నాగరత్నమ్మ శుభ్రపరచి గుడి కట్టించారు.త్యాగరాజు తాత గిరిరాజ్ కవి కూడా వాగ్గేయకారుడు.ఆయన స్మృతి కి గుర్తుగా బహుళరాగ కృతిలో "గిరిరాజసుతా తనయ" అనిస్తుతించాడు.జీవితాంతం ఊంఛ (భిక్ష)వృత్తిని అవలంబించి సామాన్యంగా జీవించాడు. ఆయన వీణవిద్వాంసుడు కూడా కావడం విశేషం.1847 జనవరి 6న తిరువయ్యూరు లో దివ్యసమాధి చెందారు.ఆయన సంగీతం కర్ణాటక సంగీత ప్రపంచంలో నేటికి అగ్రస్థానంగా ఉంది.

- యం.వి.రామారావు,8074129668

## ఓ పల్లెటూరి అమ్మాయి ఆకాంక్ష



కెరీర్ ఆరంభం నుంచి వైవిధ్యమైన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు మలయాళ అగ్ర హీరో దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మరో వినూత్న కథా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సమర్పిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రం ద్వారా సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతున్నది. సోమవారం ఆమె ఫస్ట్‌లుక్‌తో పాటు క్యారెక్టర్ టీజర్‌ను విడుదల చేశారు. ఓ పల్లెటూరి అమ్మాయి ఆకాంక్షలకు అద్దం పట్టే కథ ఇదని టీజర్‌ను చూస్తే అర్థమవుతున్నది. 'రోడ్డు కూడా సరిగ్గా లేని ఈ ఊరు నుంచి ఆకాశానికి నిచ్చెన వేశావా? ఈ ఊరు పొలిమేర దాటి చూపించు చూద్దాం..' అంటూ కథానాయికను సవాలు చేస్తూ ఓ వ్యక్తి చెప్పిన డైలాగ్ కథ తాలూకు భావోద్వేగాలను ఆవిష్కరించేలా ఉంది. జీవీ ప్రకాష్ కుమార్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంది. ఇప్పటివరకు 30శాతం చిత్రీకరణ పూర్తయిందని, వేసవిలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి రచన: గంగరాజు గుణ్ణం, నిర్మాతలు: సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం, దర్శకత్వం: పవన్ సాధినేని.

## కుటుంబ కథలదే ఈ సంక్రాంతి



'రెగ్యులర్ సినిమాల్లా కాకుండా భిన్నంగా ఉండాలని రవితేజ చెప్పడంతో.. అందుకు తగ్గట్టుగా దర్శకుడు తిరుమల కిశోర్ రాసిన కథ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కి ఆడియన్స్ నుంచి మంచి స్పందన వచ్చింది. ఆంధ్రలో ఆల్మోస్ట్ బ్రేక్ ఈవెన్ అయింది. నైజాం, సీడెడ్ కూడా దాదాపు దగ్గరకొచ్చాయి. మా డిస్ట్రిబ్యూటర్లు, బయ్యర్లు హ్యాపీగా ఉండటం మాకు ఎంతో ఆనందంగా ఉంది' అని నిర్మాత సుధాకర్ చెరుకూరి అన్నారు. రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఆయన నిర్మించిన సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతున్నదని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సంక్రాంతి టార్గెట్‌గానే ఈ సినిమాను మొదలుపెట్టాం. కేవలం 65రోజుల్లో పూర్తి చేశాం. సంక్రాంతి సీజన్‌లో కుటుంబకథలకు మంచి గిరాకీ ఉంటుందని ఈ సంక్రాంతితో మరోసారి రుజువైంది. డైరెక్టర్ దగ్గర్నుంచీ ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ప్రమోషన్స్‌కి సహకరించారు. రేపట్నుంచి విజయయాత్రలు చేయబోతున్నాం' అని తెలిపారు చెరుకూరి సుధాకర్.






## ఆజాద్ హింద్ ఫౌజ్ నేపథ్యంలో



ప్రస్తుతం ప్రభాస్ అభిమానుల దృష్టి అంతా 'ఫౌజీ' మీదే. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ వార్ డ్రామా ఈ ఏడాదే విడుదల కానుంది. అయితే.. రిలీజ్ డేట్ మీద ఇప్పటివరకూ క్లారిటీ లేదు. తాజా సమాచారం ప్రకారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న ఈ సినిమా గ్లింప్స్‌ని విడుదల చేయనున్నారని తెలిసింది. ఆ రోజే విడుదల తేదీపై కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఉందని వినికిడి. మరో విషయం ఏంటంటే.. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతున్నదట. తొలి భాగానికి ప్రీక్వెల్‌గా రెండో భాగం ఉంటుందని తెలిసింది. అభిమానుల్ని ఈ సినిమా కచ్చితంగా నిరాశపరచదని, ప్రభాస్ కెరీర్‌లోనే 'ఫౌజీ' ఓ మెమొరబుల్ మూవీగా నిలుస్తుందని ఇన్‌సైడ్ టాక్. ఆజాద్ హింద్ ఫౌజ్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తున్నారు. అనుపమ్‌ఖేర్, మిథున్ చక్రవర్తి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, నిర్మాణం: మైత్రీమూవీమేకర్స్.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com